భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# వ్యవసాయ కార్మిక రంగంలో కృషి – సమీక్ష

(2024 జనవరి 28– 30 తేదీల్లో తిరువనంతపురం, కేరళలో
జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

## వ్యవసాయ కార్మిక రంగం కృషి - సమీక్ష

**(తిరువనంతపురం, కేరళలో 2024 జనవరి 28- 30 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)**

### పరిచయం

ప్రజా సంఘాల పని విధానాన్ని సమీక్షించుకునేందుకు పార్టీ 23వ మహాసభ మార్గదర్శకాలను ఇచ్చింది. వ్యవసాయ కార్మిక రంగం కృషిపై 13 సంవత్సరాల క్రితం 2010లో చివరి సారిగా సమీక్ష జరిగింది. ప్రస్తుత సమీక్ష హైదరాబాద్‌లో జరిగిన 22వ పార్టీ మహాసభలో నిర్ణయించిన ప్రకారంగా జరిగింది.

ఈ సమీక్షలో కింది అంశాలను గుర్తించాం.

1. వేతనం మరియు భూమి వంటి వర్గ సమస్యలపై పని,
2. ఉపాధిహామీ సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేయడం,
3. దళితుల పై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా మరియు సామాజిక న్యాయం కోసం పోరాటం,
4. ఇళ్ల స్థలాల సమస్యపై జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఉద్యమాలు నిర్వహించడం,
5. సాంఘిక సంక్షేమ పథకాలు మరియు ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు కోసం పోరాటాలు,
6. నయా ఉదారవాద మరియు హిందూత్వ విధానాలకు వ్యతిరేకంగా వర్గ ఐక్యతను బలోపేతం చేయడానికి ఐక్య పోరాటాన్ని నిర్మించడం,
7. అఖిల భారత కేంద్రాన్ని బలోపేతం చేయడం మరియు దాని పనితీరును క్రమబద్ధీకరించడం
8. యూనియన్‌ను మరిన్ని రాష్ట్రాలకు, జిల్లాలకు విస్తరించడం,
9. ప్రాథమిక యూనిట్‌ల ఏర్పాటు మరియు కమిటీల పనితీరును క్రమబద్ధీకరించడం, బలోపేతం చేయడం.

ఈ అంశాలు ఎలా అమలు జరిగాయో సమీక్షిద్దాం.

రంగం పనిలో గత కొన్ని సంవత్సరాలుగా ఊహించని పరిస్థితులు ఎదురైనందున కీలకంగా మారాయి. కోవిడ్ మహమ్మారి వలన కొత్త పని పద్ధతులను రూపొందించాల్సిన అవసరం వచ్చింది. అదే సమయంలో హిందూత్వ శక్తుల మూలంగా పెరుగుతున్న మత విద్వేషాలతో పాటు విధానపరమైన దాడి వలన సంస్థకు కొత్త సవాళ్లు ఎదురయ్యాయి. భూమి, ఇళ్లు, వేతనం, ఉపాధి వంటి వర్గ సమస్యలపై పోరాటాలు నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయి. సాంఘిక సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలు దాదాపు అన్ని రాష్ట్రాల్లో మన సంఘం రోజువారీ పోరాటంలో భాగంగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమ పథకాలపై పోరాటాలు చాలా వరకు పరిష్కరించగలిగినవే. గ్రామీణ పేదలలో మరిన్ని పోరాటాలు చేసేందుకు మరియు వారి విశ్వాసం పొందే అవకాశం కూడా కల్పిస్తుందన్న అనుభవాలు మన సంఘానికి ఉన్నాయి. గ్రామీణ ఉపాధిపై మరియు కేంద్ర ప్రభుత్వ దాడుల నేపథ్యం ఉపాధిహామీకి సంబంధించిన సమస్యలపై పోరాటాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది. ఉపాధిహామీపై నిబద్ధతతో పని చేసిన రాష్ట్రాల్లో సంఘం బలపడింది. స్థానిక సమస్యలను గుర్తించడం మరియు స్థానిక పోరాటాలు నిర్వహించడం ఒక లక్ష్యంగా ఉన్నది. ఖచ్చితమైన విజయాలు సాధించే కొన్ని ముఖ్యమైన పోరాటాలు కొన్ని రాష్ట్రాల్లో జరిగినప్పటికీ చాలా రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల్లో ఆశించిన సంతృప్తికరమైన ప్రయత్నాలు జరగలేదు.

ఈ స్వతంత్ర పోరాటాలతో పాటు దళిత సమస్యలపై కృషి చేస్తున్న సంఘాలు, ట్రేడ్ యూనియన్, కిసాన్ ఫ్రంట్‌లు మరియు వామపక్ష, వ్యవసాయ కార్మిక సంఘాలను సమన్వయం చేసి కార్మిక సంఘం, కిసాన్ ఫ్రంట్‌లు సంయుక్తంగా నాయకత్వం వహించిన ఉమ్మడి వర్గ పోరాటాలలో వ్యవసాయ కార్మిక రంగం భాగస్వామ్యం అయ్యింది. మన నిర్మాణంపై ప్రధాన దృష్టి సారించడం, స్వతంత్ర బలం పెంచుకుంటూ కార్మిక-కర్షక ఐక్యతను నిర్మించడం మన ప్రధాన లక్ష్యం.

**మారుతున్న వ్యవసాయ పనుల స్వభావం :**

గ్రామీణ శ్రామికవర్గంలో వ్యవసాయ కార్మికులు ముఖ్యమైన భాగం. పేద రైతులు, వ్యవసాయ కార్మికులు ఇతర శ్రామిక వర్గంతో మైత్రి ద్వారానే జనతా ప్రజాస్వామిక విప్లవం సాధించగలుగుతాం. **ఈ పోరాటంలో గ్రామీణ ప్రాంతంలో ప్రధాన శ్రామికవర్గ శక్తిగా ఉన్న వ్యవసాయ కార్మికులు చాలా ముఖ్యమైన పాత్రను పోషించాలి.**

**పార్టీ కార్యక్రమంలో 3.18 పేరాలో ఇలా పేర్కొనబడింది: గ్రామీణ ప్రాంతంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెంపొందడం వ్యవసాయ సంబంధాలలో కనిపించే ప్రధానమైన ధోరణి. దానిని సూచించే లక్షణాలు ఏమిటంటే : గ్రామీణ కష్ట జీవుల్లో విస్తారమైన సెక్షన్‌లు, రెక్కల కష్టం తప్ప వేరే ఆధారం లేని వారుగా తయారవ్వటం, మొత్తం గ్రామీణ జనాభాలో వ్యవసాయ కార్మికుల దామాషా బాగా పెరగడం, రైతాంగంలో వర్గీకరణ వేగం పుంజుకోవడం, మార్కెట్ కోసం ఉత్పత్తి చేయడం, సాంప్రదాయకంగా కౌలుదారులుగా ఉంటున్న వారిని పెద్దఎత్తున బేదఖల్ చేయడం, గ్రామీణ సంపన్నులు ప్రత్యేకించి భూస్వాములు తమ ఆదాయాలను వ్యవసాయంలోను, వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాల్లోను తిరిగి పెట్టుబడి పెట్టడం ఫలితంగా ఇంతకు ముందు దాకా లేని స్థాయిలో పెట్టుబడి పునరుత్పత్తి చేయడానికి ప్రాతిపదిక ఏర్పరచడం.**

గ్రామీణ భారతంలో కూడా అదే ధోరణిని చూస్తున్నాం. 1961 మరియు 2001 మధ్య నాలుగు దశాబ్దాలలో, రైతుల సంఖ్య మొత్తం వ్యవసాయ శ్రామికశక్తిలో కార్మికుల సంఖ్యను మించిపోయింది. అయితే, మొట్ట మొదటగా 2011 జనాభా లెక్కల్లో వ్యవసాయ కార్మికుల సంఖ్య రైతులను అధిగమించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, 26.3 కోట్ల మంది కార్మికులు (రైతులు, వ్యవసాయ కార్మికులు) వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారు. 1952లో వ్యవసాయంలో ఉన్నవారిలో రైతుల వాటా 82 శాతం, కార్మికుల సంఖ్య 18 శాతంగా ఉండేది. **కానీ ప్రస్తుతం రైతుల సంఖ్య 45.2 శాతంకు తగ్గి, వ్యవసాయ కార్మికుల వాటా 55 శాతానికి పెరిగింది.** 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రధాన, చిన్న రైతుల సంఖ్య 11,86,69,264 కాగా వ్యవసాయ కార్మికుల సంఖ్య 14,43,29,833గా ఉంది. 1961లో ప్రతి 100 మంది రైతులకు దాదాపు 33 మంది కూలీలు ఉండేవారు, **అదే 2011 నాటికి ప్రతి 100 మంది రైతులకు 121 మంది కూలీలు ఉన్నారు.**

లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు తమ భూమిని అమ్ముకోవలసి వచ్చిందని, సాగును విడిచిపెట్టి వ్యవసాయ కూలీ జాబితాలో చేరవలసి వచ్చిందని, వివిధ అధ్యయనాలు అనంతరం జాతీయ గణాంక సంస్థ NSO వెల్లడించింది. రైతులే కాకుండా, చిన్న చేతివృత్తిదారులు కూడా తమ పనిని కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీల సంఖ్య పెరిగినా వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. అదనంగా, విచక్షణా రహితంగా మానవ శ్రమ బదులు యంత్రాలను ఉపయోగించడం వల్ల పని రోజులు మరింత తగ్గాయి.

**పనిలో బహుళత్వం:** బహుళ వృత్తులు చేయడం వ్యవసాయ కార్మికుల లక్షణం. వివిధ రుతువుల్లో వివిధ పనులు చేపట్టడం ప్రధాన లక్షణం. చాలా మంది వ్యవసాయ కార్మికులు ఏడాది పొడవునా ఏదో ఒక నిర్దిష్ట పనికే పరిమితం కారు. దాదాపు గ్రామీణ కార్మికులు అందరు వ్యవసాయ పనిలో వివిధ స్థాయిలలో పాల్గొంటారు. వారు ఉపాధిహామీ మొదలు ఇటుక బట్టీ పని వరకు ఏ పనైనా చేస్తుంటారు, వ్యవసాయ కార్మికులు సమీపంలో ఉన్న చిన్న నగరాల్లో పారిశ్రామిక పనులకు వెళుతుంటారు. వివిధ సమయాల్లో బహుళ పనులను చేస్తున్నారు.

గ్రామీణ శ్రామికులలో వ్యవసాయంలో వేతన కార్మికులు, వ్యవసాయేతర పనుల్లోని వేతన కార్మికులు అంటూ రెండు విభిన్న విభాగాలుగా లేరని వ్యవసాయ రంగంపై పార్టీ అధ్యయన బృందం నిర్ధారించింది. వ్యవసాయ కార్మికులు పట్టణ ప్రాంతాలలో అనేక రకాల వ్యవసాయేతర పనులలో, వలస కార్మికులుగా కూడా పని చేస్తారు. అయినప్పటికీ గ్రామీణ కార్మికులు పాక్షిక వ్యవసాయ, గ్రామీణ స్వభావాన్ని కలిగి ఉంటారు. ముఖ్యమైన అంశాలలో, పట్టణ శ్రామికవర్గంకు భిన్నంగా ఉంటారు.

వివిధ రంగాలలో పనిచేస్తున్న గ్రామీణ కార్మికుల సంఖ్య పెరిగిందని, అయితే అలా వివిధ రంగాల్లో పని చేసినా, వారు ప్రధానంగా వ్యవసాయంతో సంబంధం కలిగి ఉన్నారని దీని అర్థం. బహుళ వృత్తులు, అధిక సంఖ్యలో గ్రామీణ కార్మికులతో కూడిన ఈ ప్రక్రియను అవగతం చేసుకుని వారిని సమీకరించాలి. వ్యవసాయ కార్మిక సంఘాలు ఈ మారుతున్న స్వభావాన్ని పరిగణలోకి తీసుకుని వ్యవసాయంలో పని తగినంత లేని కారణంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులను, గ్రామీణ ప్రాంత కార్మికులందరినీ సంఘటితం చేయాలి.

**వేతన సమస్య :** ప్రకటించిన కనీస వేతనాలను అమలు చేయకపోవడం భారతీయ కార్మిక శాఖ యొక్క ఒక ముఖ్య లక్షణం, మొత్తం వేతన కార్మికులలో 40 శాతం కంటే ఎక్కువ మంది కనీస వేతనం కంటే తక్కువగా పొందుతున్నారు. తాజా అధికారిక గణాంకాల ప్రకారం, 2021-22లో అఖిల భారత స్థాయిలో సగటు వేతనం పురుష కార్మికులకు రోజుకు రూ. 340 మరియు మహిళా కార్మికులకు రోజుకు రూ. 278. అత్యధిక గ్రామీణ కార్మికులు ప్రభుత్వం సిఫార్సు చేసిన కనీస వేతనాల కంటే తక్కువ వేతనాలను పొందుతున్నారు. వేతన రేట్లలో ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్నాయి. పురుష కార్మికులకు వ్యవసాయంలో చెల్లించే వేతనాల్లో కేరళది ప్రత్యేక స్థానం. కేరళ రాష్ట్రం అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నది. కేరళ తరువాత

తమిళనాడు, కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు జమ్మూ & కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నాయి.

వ్యవసాయ ప్రధాన మరియు వ్యవసాయేతర వృత్తులలో వేతనాలు 2013–14 నుండి 2018–19 మధ్య కాలంలో సంవత్సరానికి 3 శాతం తగ్గాయి. ఈ తగ్గుదలకు పెద్ద నోట్ల రద్దు, GST విధింపు, ఉపాధిహామీతో సహా అనేక సామాజిక భద్రతా పథకాలకు బడ్జెట్ కేటాయింపులో తగ్గింపు, సబ్సిడీలలో కోతలు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. లాక్‌డౌన్ సమయం నుండి అఖిల భారత స్థాయిలో ప్రధానంగా గ్రామీణ వృత్తులలో వేతనాల తగ్గుదల కనిపించింది. అయితే, జూన్ 2019 నుండి, అంటే, కోవిడ్–19 మహమ్మారి కంటే ముందే ఈ తగ్గుదల ప్రారంభమైందని గమనించాలి.

గ్రామీణ భారతదేశంలో, వివిధ వృత్తులలో అదే వృత్తిలో ఉన్న పురుష కార్మికుల కంటే మహిళా కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. 2021–22లో పురుష కార్మికుల కంటే అఖిల భారత స్థాయిలో మహిళా వేతనాలు 15 శాతం తక్కువగా ఉన్నాయి. ప్రాంతాల వారీగా వేతన రేట్లలో లింగ అసమానతలో గణనీయమైన వ్యత్యాసం ఉంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు తర్వాత, కనీస వేతనాల సమస్య మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. కూలీ రేట్లు కాలానుగుణంగా పెంచడం లేదు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడానికి ఎటువంటి ప్రభుత్వ యంత్రాంగం లేదు.

**సాంఘిక సంక్షేమ పథకాలపై నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావం:**

బీజేపీ అనుసరిస్తున్న సంపన్నవర్గాల అనుకూల విధానాలు వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి. వ్యవసాయ సంక్షోభం దేశ ఆహార స్వయం సమృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దేశంలో తగినంత ఆహార ధాన్యాలు ఉన్నప్పటికీ, భారీ సంఖ్యలో ప్రజలు ఆకలితో, పోషకాల లోపాలతో బాధపడుతున్నారు.

తక్కువ ఆదాయం మరియు భారీ నిరుద్యోగం ఉన్న పరిస్థితుల్లో, వ్యవసాయ కార్మికుల జీవితాలు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థలపై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. కానీ, విదేశీ మరియు భారతీయ పెట్టుబడి రెండింటికీ ఈ సంక్షేమ పథకాలు ఆమోదయోగ్యం కాదు. ఎల్‌డిఎఫ్ నేతృత్వంలోని కేరళ రాష్ట్ర ప్రభుత్వం మినహా, ఆరోగ్యం, విద్యతో సహా ప్రభుత్వ రంగాన్ని భారీగా ప్రైవేటీకరించడం వలన ప్రజల

వర్తమానం, భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది. సాంఘిక సంక్షేమ పింఛన్లు – ఉదా. వితంతువు, వృద్ధాప్యం చాలా వరకు పాలక వర్గాల లక్ష్య పథకాలుగా మార్చ బడుతున్నాయి. ఈ ప్రక్రియలో గ్రామీణ భారతదేశంలోని హెచ్చు సంఖ్యలో పేదలకు అందడంలేదు. సంక్షేమ పథకాలను 'ఉచితాల సంస్కృతి' మరియు 'రెవడీలు' అని పేర్కొన్న మోడీ, ఈ పథకాలను కించపర్చడమే కాకుండా, అమలులో ఉన్న ఈ అతి తక్కువ సంక్షేమ పథకాలను కూడా తగ్గించాలనో లేదా ఆపివేయాలనో చూస్తున్నాడు.

**వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు :**

వ్యవసాయ రంగంలో సంక్షోభం చాలా తీవ్రంగా ఉండడం వలన వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వారు ఎదుర్కొంటున్న ఒత్తిడి పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తుంది. 2013 వరకు వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు అసలు నమోదు కాలేదు. 2014లో వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల నమోదుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదే ఏడాది 5650 మంది రైతులు, 6710 మంది వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు నమోదయ్యాయి. గతేడాది నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో (NCRB) నివేదిక ప్రకారం 5563 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మొత్తం మీద, 2014 నుండి, 40,685 మంది రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

**భూమి సమస్య :** భూమి లేని వ్యవసాయ కార్మికులకు భూమి సహజంగా ఇప్పటికీ ఒక పెద్ద సమస్య. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (NSSO) సర్వేల డేటా ప్రకారం 2018–19లో 41 శాతం గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS) డేటా ప్రకారం 2015–16లో దాదాపు 47 శాతం గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. 2011 నాటి సామాజిక ఆర్థిక, కుల గణన (SECC) ప్రకారం గ్రామీణ కుటుంబాలలో 56 శాతం భూమి లేనివారు అని తేలింది. ఆంధ్రప్రదేశ్ (54.4 శాతం), బీహార్ (49.3 శాతం), పంజాబ్ (46.3 శాతం), తెలంగాణ (42.5 శాతం) వంటి రాష్ట్రాల్లో 2018 – 19లో భూమిలేని వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందని NSSO డేటా కూడా చెప్తున్నది.

భారతదేశంలోని గ్రామాల్లో కొద్ది మంది చేతుల్లో భూమి కేంద్రీకరించబడి ఉన్నది అనేది వాస్తవం. 2018–19కి సంబంధించిన SSSO డేటా ప్రకారం 20 శాతం గ్రామీణ సంపన్న కుటుంబాలు మొత్తం భూమిలో 76 శాతం కలిగి ఉన్నాయి.

2015–16 సంవత్సరానికి సంబంధించిన NFHS డేటా ప్రకారం గ్రామీణ కుటుంబాల్లోని 20 శాతం గ్రామీణ సంపన్న కుటుంబాలు మొత్తం భూమిలో 83 శాతం కలిగి ఉన్నారు. గత రెండు దశాబ్దాలుగా ఈ పరిస్థితి పెరిగింది.

భూ సంస్కరణలు, భూమి పునర్విభజన వంటి అంశాలు ఇప్పుడు ప్రధాన రాజకీయ చర్చ నుండి అదృశ్యమయ్యాయి. ఇటీవలి కాలంలో మరీ ముఖ్యంగా నయా ఉదారవాద సంస్కరణల తర్వాత, భూసంస్కరణలు తిరోగమన బాట పట్టాయి. NSSO (1987–88) 43వ రౌండ్ సర్వేలో భూమిలేని కుటుంబాల శాతాన్ని 68వ రౌండ్ NSSO సర్వే (2011–12)తో పోల్చి చూస్తే, భూమి లేనివారి నిష్పత్తిని అంచనా వేయవచ్చు. ఈ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కుటుంబాలు (0.01 హెక్టార్ల కంటే తక్కువ పావు ఎకరాలోపు భూమిని కలిగి ఉన్నవి) 35 శాతం నుంచి 49 శాతానికి పెరిగాయి. ప్రభుత్వం వివిధ అవసరాల కోసం భూమిని సమీకరించి, సేకరించడంతో చిన్న, సన్నకారు రైతులను నిర్వాసితులను చేస్తోంది. వ్యవసాయ కార్మికులు సైతం తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోతున్నారు. సేకరించిన భూమికి రైతులకు కొంత పరిహారం లభిస్తుండగా, వ్యవసాయ కార్మికులు ఈ భూమి పై ఉన్న ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. 1970, 80వ దశకాల్లో, భూస్వాములకు వ్యతిరేకంగా భూ పోరాటాలు అనేక రాష్ట్రాల్లో జరిగాయి, అయితే గత రెండు దశాబ్దాలలో, చాలా తక్కువ భూ పోరాటాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల భూపోరాటాలు జరుగుతున్నా, అవి భూస్వాములకు వ్యతిరేకంగా కాకుండా ప్రభుత్వ భూముల కోసమే పోరాటాలు జరుగుతున్నాయి. గ్రామీణ కార్మికులకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఎన్నికల హామీలు, ప్రభుత్వ పెద్దల హామీలు అమలు కావడం లేదు.

**ఉపాధి :** వ్యవసాయ సంక్షోభం తీవ్రమవుతున్నందున, గ్రామీణ నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకుంటున్నది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (CMIE) ప్రకారం జూన్ 2023లో గ్రామీణ నిరుద్యోగం 8.73 శాతానికి చేరుకుంది. పారిశ్రామిక రంగమే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కారణంగా వ్యవసాయ రంగంలో ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యామ్నాయ రంగాలలో ఉపాధి లభించడం లేదు. ఆగస్టు 2023లో మొత్తం నిరుద్యోగం రేటు 8.1 శాతంగా ఉంది. యువతలో నిరుద్యోగం (15–24 సంవత్సరాలు) చాలా హెచ్చుగా 23.22 శాతం ఉంది.

MNREGA అనేది UPA-I ప్రభుత్వ హయాంలో ఉపాధి హక్కు కోసం చేసిన సుదీర్ఘ పోరాటం, పార్లమెంటులో వామపక్షాల రాజకీయ బలం యొక్క ఫలితం.

అమలులోకి వచ్చిన ఇన్ని సంవత్సరాల్లో, ఉపాధిహామీ పథకం గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా తోడ్పడింది. ఇది గ్రామీణ ప్రజానీకానికి చెందిన అత్యంత పేద, అత్యంత అణగారిన వర్గాలు మనుగడ సాగించడానికి సహాయపడింది, అదే సమయంలో వ్యవసాయ కార్మికులు మరియు గ్రామీణ కార్మికుల సాధారణ వేతనాలు తగ్గకుండా నిరోధించింది. చాలా ప్రాంతాలలో, వేతనాలు స్థిరంగా ఉండగా కొన్ని ప్రాంతాల్లో వేతనాల్లో పెరుగుదల కనబడింది. ఉపాధిహామీ పథకంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కార్మికుల భాగస్వామ్యం జనాభాలో వారి నిష్పత్తి కంటే ఎక్కువ. ఉపాధిహామీ పనిలో మహిళల భాగస్వామ్యం స్ఫూర్తిదాయకం. మొత్తం కార్మికులలో, మహిళలు 2019–20 సంవత్సరంలో 54.78 శాతం, 2020–21లో 53.19 శాతం, 2021–22లో 54.67 శాతం, 2022–23లో దాదాపు 56 శాతంగా ఉన్నారు.

ఈ వాస్తవాలు ఉన్నప్పటికీ, మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తోంది. నయా–ఉదారవాద ఆర్థిక విధానాలు మోడీ ప్రభుత్వానికి మార్గదర్శక శక్తిగా ఉన్నాయి, ఇది ఉపాధిహామీని అనవసరమైనదిగా పరిగణించడమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధికి అడ్డంకిగా కూడా పరిగణిస్తోంది. ఈ డిమాండ్–ఆధారిత ఉపాధి పథకం మోడీ పాలనలో నిధుల కొరత, తక్కువ వేతనాలు, సోషల్ ఆడిట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను బలహీనపరచడం, ఉపాధిహామీలో పాల్గొన్న కార్మికులు, స్థానిక అధికారులను నిరుత్సాహపరచడం, మరీ ముఖ్యంగా కొత్తగా మార్పు చేసి తెచ్చిన ఆధార్‌తో అనుసంధానంతో ఆన్లైన్ హాజరు, (కులాల వారీగా) నిధుల కేటాయింపు, వేతనంపంపిణీ వ్యవస్థల వలన ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉపాధిహామీ పథకంపై బిజెపి ప్రభుత్వం చేసిన ప్రధాన దాడి, వరుస వారీ కేంద్ర బడ్జెట్లలో తగినంత నిధుల కేటాయింపును నిరంతరం తిరస్కరించడం. మొత్తం బడ్జెట్లో ఉపాధిహామీ పథకం కోసం కేటాయించిన నిధుల నిష్పత్తి తగ్గుతూ వస్తున్నది. 2013–14 ఆర్థిక సంవత్సరం మొత్తం బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకం బడ్జెట్ 1.98 శాతం కలిగి ఉండేది. ఇది 2022–23లో మొత్తం బడ్జెట్‌లో 1.85 శాతానికి తగ్గింది. 2020–21కోవిడ్ సంవత్సరంలో అత్యధికంగా రూ. 1,11,500 కోట్లు ఖర్చు చేశారు. ఇది 2022–23 సంవత్సరానికి రూ. 60,000 కోట్లకు తగ్గింది. వివిధ ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం, ఉపాధిహామీ పథకం లక్ష్యాన్ని నెరవేర్చడానికి అవసరమైన కనీస బడ్జెట్ రూ. 2.64 లక్షల కోట్లు అవసరం.

ఉపాధిహామీ పథకం నుండి వచ్చే ఆదాయం వ్యవసాయ కార్మికుల ఆదాయంలో ముఖ్యమైన భాగంగా మారింది. కానీ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దశలవారీగా రద్దు చేసేందుకు కసరత్తు చేస్తోంది. దీన్ని అన్ని స్థాయిల్లో గ్రామీణ ప్రజానీకం ప్రతిఘటించాలి. ఇలాంటి ఉపాధి హామీ పథకం పట్టణాల్లో కూడా ప్రారంభించేందుకు పోరాటం చేయాలి.

పెరుతున్న నిరుద్యోగం, అధిక ధరల వలన కొట్టుమిట్టాడుతున్న పట్టణ పేదలకు సహాయం చేయడానికి పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అవసరం.

**వలసలు:** కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం కారణంగా పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు, ఇతర గ్రామీణ శ్రామిక జనాభా వారి స్వస్థలాల నుండి భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళవలసి వస్తున్నది. వలస కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారిలో ఎక్కువ మంది అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో పని చేసే వలస కూలీలకు సామాజిక భద్రతా వ్యవస్థ ఏమి లేదు. కోవిడ్ –19 మహమ్మారి సమయంలో, గ్రామీణ ప్రాంతాలకు తిరిగి భారీ వలసలు రావడం ఈ పరిస్థితికి దారితీసింది. వలస కార్మికులను సంఘటితం చేయడం చాలా ముఖ్యం. గ్రామీణ భారతదేశంలో వ్యవసాయ కార్మికులుగా, ఇతర కార్మికులుగా పనిచేస్తున్న వలస కార్మికులను సంఘటితం చేయడానికి పార్టీ మార్గనిర్దేశం, సహాయం చేయాలి. అది జరగాలంటే అంతర్రాష్ట్ర సమన్వయం కూడా అవసరం. ఈ కార్మికులను వారి నివాస ప్రాంతాల దగ్గర లేదా వారి పని ప్రదేశాల్లో సంఘటితం చేయాలి. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వలస కార్మికుల భద్రత, సంక్షేమం, వారి పిల్లలకు ఆరోగ్యం, విద్యను అందించేందుకు ప్రత్యేక సదుపాయం కల్పిస్తున్నది.

**కుల అణచివేత, కుల రాజకీయాలు :** దాదాపు 50 శాతం మంది వ్యవసాయ కార్మికులు షెడ్యూల్డ్ కులాల వారే. వారు ఆర్థికంగా మాత్రమే కాకుండా గ్రామీణ సమాజంలో సామాజిక అణచివేతకు కూడా గురౌతున్నారు. మనుస్మృతిలోని చాతుర్వర్ణం ఆధారంగా ఈ భూస్వామ్య సమాజంలో వారు అనేక రకాల దౌర్జన్యాలు, అణచివేతలకు గురవుతున్నారు. అస్తిత్వ రాజకీయాలను 20వ శతాబ్దం చివరి దశాబ్దంలో రాజకీయ ప్రయోజనాల కోసం కుల శక్తులు ఉపయోగించుకున్నాయి. ఇప్పుడు హిందూత్వ శక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కుల రాజకీయాలను ఉపయోగించుకుంటున్నాయి. అదే సమయంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు

సర్వసాధారణమైపోయాయి. ఇలాంటి ఘటనల్లో బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

SC, STలు, భూమిలేని వారికి భూమిని పొందే హక్కును పరిరక్షించే చట్టాలను నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రత్యక్ష మరియు పరోక్ష చర్యలను ప్రోత్సహిస్తుంది. భూ సంస్కరణల చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కూడా తెస్తోంది. గతంలో దళితులకు ఇచ్చిన భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు దారితీసిన ల్యాండ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహిస్తోంది. ఈ విధానాలు ఇప్పటికే భూమి కలిగి ఉండే విషయంలో ఉన్న అంతరాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

దళితులు, గిరిజనులపై నేరాలు విపరీతంగా పెరిగాయని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ గణాంకాలు కూడా సరియైన పరిస్థితిని తెలియజేయవు. అణగారిన సమాజ జీవన పరిస్థితులు, పోలీసుల ఉదాసీనత, పక్షపాతం కారణంగా చాలా కేసులు ఇప్పటికీ నమోదు కాలేదు. కాబట్టి పూర్తి చిత్రాన్ని ఈ గణాంకాలు తెలియజేయవు. ప్రయివేటీకరణతో, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు కానందున, ఎస్సీ/ఎస్టీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. రిజర్వేషన్లు ప్రభావవంతంగా ఉండాలంటే కఠినంగా అమలు చేయబడాలి. ప్రైవేట్ రంగానికి కూడా విస్తరించాలి.

గత మూడు దశాబ్దాలలో అస్తిత్వ రాజకీయాల పెరుగుదలను మనము చూశాము. ఇది హిందీ భాషా భూభాగంలో శ్రామిక వర్గ ఉద్యమాన్ని, వామపక్ష ప్రజా పునాదిని ప్రతికూలంగా ప్రభావితం చేసింది. గ్రామీణ శ్రామిక వర్గం యొక్క సంస్థ అయినందున, ఈ ఫ్రంట్ కుల దౌర్జన్యాలు, కుల అణచివేత సమస్యలను చేపట్టాలి. అస్తిత్వ రాజకీయాలను అదుపులో ఉంచడం, గ్రామీణ శ్రామికుల ఐక్యతను బలోపేతం చేయడం కూడా చాలా ముఖ్యం.

**మహిళా వ్యవసాయ కార్మికుల దోపిడీ:** 2011 సెన్సస్ ప్రకారం భారతదేశంలో మహిళా వ్యవసాయ కార్మికులు (ప్రధాన మరియు ఇతర) సంఖ్య 6.15 కోట్లు. వ్యవసాయం వెలుపల పని కోసం వెతకడం పురుషుల ప్రత్యేక హక్కుగా వ్యవసాయ పనులను స్త్రీల పనిగా పరిగణిస్తున్నారు. వ్యవసాయంలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, మహిళలకు వేతనాలు తక్కువగానే కొనసాగుతున్నాయి. మహిళా వ్యవసాయ కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు లేవు. తత్ఫలితంగా, మహిళలు గర్భం యొక్క చివరి దశల వరకు పని చేయాల్సి వస్తుంది. బిడ్డను ప్రసవించిన కొన్ని

రోజులలోపే తిరిగి పనిలోకి వెళ్ళాల్సి వస్తుంది. మహిళా వ్యవసాయ కార్మికులు సమాజంలోని మూస పద్ధతులు, లైంగిక వేధింపుల ద్వారా అడుగడుగునా సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. వారి శ్రమ దోపిడీకి తోడు వారి పై దౌర్జన్యాలు కూడా పెరుగుతున్నాయి. గ్రామీణ భారతదేశంలోని మహిళా కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్దఎత్తున పోరాటం చేయాలి.

**హిందుత్వ ప్రభావం:** హిందూత్వ భావజాలం పురోగమించడంతో మన సమాజంలో మతపరమైన విభేదాలు పెరుగుతున్నాయి. గ్రామీణ భారత దేశంలో కూడా ఇటువంటి మతతత్వ విషం వేగంగా విస్తరిస్తున్నది. గ్రామీణ భారతదేశం యొక్క భూస్వామ్య వ్యవస్థ మతపరమైన విభేదాలకు అనుకూలంగా ఉంటుంది. హిందుత్వ శక్తులే మన పండుగలు, ఆచార వ్యవహారాలను మతతత్వానికి దుర్వినియోగిస్తున్నారు. వ్యవసాయ కార్మికులపై కూడా హిందూత్వ భావజాల ప్రభావం కనిపిస్తోంది. మతపరమైన అంశాల విషయానికి వస్తే, ఆర్థిక విషయాలలో కూడా రాజీకి సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రభావం ఎంతగా చూపుతుందంటే, అధ్వాన్నమైన పరిస్థితులు, కష్టాలలో జీవిస్తున్నప్పటికీ, సాధారణ కార్మికులు ప్రభుత్వ ఆర్థిక విధానాలను లక్ష్యంగా చేసుకోకుండా మతం వలన సృష్టించిన కథనాలలో చిక్కుకున్నారు. గ్రామీణ భారతదేశంలోని వివిధ ఎన్నికలలో BJP లాభ పడడంలో కూడా ఇది ప్రతిబింబిస్తుంది. గతంలో మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకున్న బిజెపి హిందుత్వ భావజాలం ఇప్పుడు పల్లెల్లో కూడా చొచ్చుకుపోయింది. కార్మికవర్గాన్ని విభజించడానికి బిజెపి కులాన్ని ఉపయోగిస్తుంది, హిందూ అస్తిత్వాన్ని ఉపయోగించి దళితులను మైనారిటీలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నది. ఉపకులాలను కూడా బీజేపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది.

**వ్యవసాయ కార్మికులకు సమగ్ర కేంద్ర చట్టం :** వ్యవసాయ కార్మికులకు వారి హక్కులను కాపాడుకోవడానికి ఎటువంటి చట్టపరమైన రక్షణ లేదు. వ్యవసాయ కార్మికుల కోసం కేంద్రం సమగ్ర చట్టం చెయ్యాలని డిమాండ్ చేయాలి. ఇది కేవలం డిమాండ్ మాత్రమే కాదు వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం ఏర్పాటైన వివిధ కమిటీల సిఫార్సులు. పార్లమెంటులో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ప్రైవేట్ బిల్లులు 2010, 2016, 2018, ఇటీవలే 2022 లో ప్రవేశపెట్టబడ్డాయి. అంతకుముందు ప్రభుత్వాలు కొన్ని హామీలు ఇచ్చాయి. కానీ BJP నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు కూడా నిరాకరించింది.

అసంఘటిత రంగంలో, వ్యవసాయ కార్మికుల పని పరిస్థితులను నియంత్రించడానికి రాష్ట్ర స్థాయిలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. కేరళ అగ్రికల్చరల్ వర్కర్ యాక్ట్ (1974), కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు ఒక ముఖ్యమైన ఉదాహరణ. అందువల్ల, వివాద పరిష్కార యంత్రాంగాలు, భద్రత, వేతనాలు, పని గంటలు, ఆరోగ్యం, సాంఘిక సంక్షేమ ప్రయోజనాల కోసం వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర కేంద్ర చట్టం కోసం పోరాటాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది.

**3. ప్రధాన పోరాటాలు, కార్యకలాపాలు**

వ్యవసాయ, గ్రామీణ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాన్ని నిర్మించింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన విధానపరమైన అంశాలే కాకుండా వ్యవసాయ కార్మికుల సమస్యలు చాలా వరకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలతో ముడిపడి ఉన్నాయని మన అనుభవం. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర, జిల్లా, దిగువ స్థాయి కార్యక్రమాల పై దృష్టి పెట్టడం జరుగుతున్నది. కేంద్ర సమస్యలపై అఖిల భారత సమీకరణలు కూడా స్వతంత్రంగా, ఉమ్మడిగా నిర్వహించబడ్డాయి. దేశ వ్యాప్త పిలుపులు కూడా క్రమం తప్పకుండా అమలవుతున్నాయి. సమస్యలపై నిర్వహించిన కొన్ని ముఖ్యమైన పోరాటాలు ఇవీ–

**వేతన పోరాటం:** అఖిల భారత మహాసభలన్నీ వేతన పోరాటానికి, అందుకు అవసరమైన వర్గ దృక్పధం కలిగిన అంశాలకు ప్రాధాన్యతనిచ్చాయి. ఉద్యమాన్ని నిర్మించేందుకు అఖిల భారత కేంద్రం నుంచి ప్రయత్నాలు జరిగాయి కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే వేతన పోరాటాలు జరిగాయి, అయితే సమస్య యొక్క తీవ్రతను పరిగణనలోకి తీసుకుని స్థిరమైన ప్రణాళికాబద్ధమైన పోరాటాలు నిర్వహించబడలేదు.

పశ్చిమ బెంగాల్‌లో, 2018లో ఖరీఫ్ సీజన్‌లో వేతనాల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు జరిగాయి. చాలా జిల్లా కమిటీలు ఈ సమస్యను చేపట్టాయి, సుమారు 500 గ్రామాల్లో జరిగింది. తెలంగాణలోని 14 జిల్లాల్లోని 270 కేంద్రాల్లో ఈ వేతన పోరాటం చేపట్టారు. 70 కేంద్రాల్లో సమ్మెను విజయవంతం చేశారు. ఈ పోరాటాల ఫలితంగా చాలా చోట్ల కార్మికుల వేతనాలు పెరిగాయి. మహారాష్ట్రలో, ట్రేడ్ యూనియన్ ఫ్రంట్‌తో కలిసి చెరుకు వేతన సమస్యపై కార్మికులను సంఘటితం చేసాము. ఆగస్ట్ మరియు సెప్టెంబరు 2018లో రెండు నెలల పాటు కార్మికుల సమ్మె నిర్వహించబడింది. పంజాబ్, హర్యానాలోని కొన్ని జిల్లాల్లోని కొన్ని పంచాయతీల ఆదేశాలను మనం విజయవంతంగా ప్రతిఘటించాము. ఈ ఒత్తిడి

వలన పంచాయతీలు తమ నోటిఫికేషన్‌లను వెనక్కి తీసుకుని వ్యవసాయ కార్మికులకు అధిక వేతనాలు ఇవ్వాల్సి వచ్చింది. 2022 ఏప్రిల్‌లో రాజస్థాన్‌లో విజయవంతమైన వేతన పోరాటం జరిగింది. మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల్లో వేతన పోరాటం జరిగింది. మన నిరంతర పోరాటాల కారణంగా కర్ణాటక ప్రభుత్వం ఇటీవల రైతు కూలీల కనీస వేతనాలను సవరించింది. వేతన సమస్యలపై పోరాటంలో మెరుగుదల ఉన్నప్పటికీ, మరింత తీవ్రమైన ప్రయత్నాలు అవసరం.

వేతన పోరాటం గ్రామాల్లోని భూస్వాములు/ధనిక రైతులతో ఘర్షణకు దారి తీస్తుంది. మునుపటి రోజుల్లో మనం వివిధ వేతన పోరాటాలకు నాయకత్వం వహించాము. ఇది గ్రామీణ ప్రజల్లో విస్తరించడానికి మరియు రాజకీయ చైతన్యం కల్పించడానికి ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ ప్రయత్నాలు కొరవడుతున్నాయి. ఈ పోరాటమే వ్యవసాయ కార్మిక వర్గం, పార్టీ యొక్క ప్రజా, విప్లవ స్వభావాన్ని బలోపేతం చేయడానికి సహాయపడే ప్రధాన ఉద్యమం.

వేతనాల కోసం పెద్దగా నిరంతర పోరాటాలు జరగడం లేదు. దీనికి ఒక కారణం ఉన్న పనిదినాలు తగ్గడం, ప్రమాదకరమైన ఉపాధి స్వభావం ఫలితంగా ఏర్పడే అభద్రత వేతనాల పెరుగుదల కోసం పోరాటాలకు ఆటంకం కలిగిస్తుంది. పోరాటాలు జరగకపోవడానికి మరొక కారణం: చాలా చోట్ల రంగం మరియు పార్టీ బలహీనత కారణంగా, వ్యవసాయ కార్మిక సంఘం వేతన పోరాటాలకు నాయకత్వం వహించలేక పోయింది. వ్యవసాయ కార్మికులకు భూస్వాములు, ధనిక రైతులపై పోరాడే విశ్వాసం కలిగించలేక పోయింది.

ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వేతన పోరాటాలను పెంచడానికి, కొనసాగించడానికి మార్గాలను కనుకోవాలి. ఈ విషయంలో వ్యవసాయ కార్మికుల ఉద్యమానికి పార్టీ సహకరించాలి. హిందీ రాష్ట్రాల్లో ఇందుకోసం ప్రత్యేకంగా కృషి చేయాలి.

ఉపాధిహామీ కింద 14.34 కోట్ల జాబ్ కార్డుల ద్వారా 25.5 కోట్ల మంది కార్మికులు నమోదు చేసుకోగా, క్రియాశీల కార్మికులు, జాబ్ కార్డుల సంఖ్య వరుసగా 14.35 కోట్లు, 9.77 కోట్లు. ఇవి 2,69,423 పంచాయతీలు, 7,173 బ్లాక్‌లు, 740 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఉపాధిహామీ నిరంతరం పోరాటాలకు ప్రధాన ఎజెండాగా తీసుకున్నప్పటికీ ఉపాధిహామీలో ఉన్న భారీ సంఖ్యలో కార్మికులను పరిగణనలోకి తీసుకుంటే అది సరిపోలేదు. అఖిల భారత కేంద్రం రాష్ట్రాల పరిస్థితిని చురుగ్గా కదిలిస్తూ పోరాటాలు చేపట్టేలా మార్గదర్శకం చేసింది. కేంద్ర ప్రభుత్వ

విధానాలకు వ్యతిరేకంగా 4 నవంబర్ 2019, 2 ఆగస్టు 2018, 5 సెప్టెంబర్ 2021 తేదీలలో మూడు అఖిల భారత స్థాయి సభలు జరిగాయి.

దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, త్రిపుర, మహారాష్ట్ర వంటి ప్రధాన రాష్ట్రాలు ఉపాధిహామీకి సంబంధించిన పని డిమాండ్, వేతనాల బకాయిల వంటి సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాయి. రాజస్థాన్, హర్యానా కూడా ఉపాధిహామీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం చొరవ తీసుకుంటున్నాయి. ఉపాధిహామీ డిమాండ్లను లేవనెత్తడమే కాకుండా, సానుకూల ఫలితాలతో పట్టణ ఉపాధి హామీ చట్టం కోసం తమిళనాడు కమిటి ప్రజలను సమీకరించింది. ఇటీవల పశ్చిమ బెంగాల్ కూడా ఉపాధిహామీ సమస్యల పై పోరాడుతున్నది. మన కేరళ యూనిట్, ఉపాధిహామీ వర్కర్స్ ఆర్గనైజేషన్ కలిసి అఖిల భారత నిరసన పిలుపులో భాగంగా లక్ష మందికి పైగా కార్మికుల సమీకరణతో ఉమ్మడి నిరసన కార్యక్రమాలను నిర్వహించాయి. దేశంలోని దాదాపు 225 జిల్లాలు మరియు 20,000 కంటే ఎక్కువ గ్రామాల్లో ఉపాధిహామీ పై పోరాటం జరిగింది. అనేక రాష్ట్రాలు ఉపాధిహామీపై ముఖ్యంగా పని, పెండింగ్ వేతనాల కోసం జాతాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, పికెటింగ్‌లు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు వంటి మిలిటెంట్ పోరాటాలు నిర్వహించాయి.

స్వతంత్ర కృషితో పాటు వామపక్ష సంఘాల ఐక్య పోరాటాలు కూడా జరిగాయి. ఉపాధిహామీపై విధాన పరమైన దాడులకు వ్యతిరేకంగా ఉమ్మడి అఖిల భారత పిలుపులు జిల్లా స్థాయిలో సమర్ధవంతమైన సమీకరణలతో క్రమం తప్పకుండా నిర్వహించాము. నిరంతర ఫాలో అప్ వలన ఉత్తర్ ప్రదేశ్, బీహార్‌లో కూడా ఉపాధిహామీ సమస్యలపై జోక్యం చేసుకోవడం ప్రారంభించాయి. ఈ ప్రయత్నాలు మంచి ఫలితాలను తెస్తున్నాయి. గణనీయమైన సంఖ్యలో కార్మికులు మన సంఘంలో సాధారణ కేడర్‌గా మారుతున్నారు, గ్రామీణ కార్మికులలో సంఘం యొక్క పోరాట పటిమ పెరిగింది. ఉపాధిహామీపై పోరాటాల ద్వారా మహారాష్ట్రలోని రెండు జిల్లాల్లో రంగం విస్తరించింది. అదేవిధంగా ఉపాధిహామీ సమస్యలపై నిరంతర పోరాటాల వల్ల తెలంగాణ, ఆంధ్రాలో సభ్యత్వం పెరిగింది. అనేక రాష్ట్రాల్లో ఉపాధిహామీ కోసం ప్రత్యేక సంఘాలు పనిచేస్తున్నాయి. ఉపాధిహామీ వర్కర్స్ యూనియన్‌లతో మరింత సమన్వయం ఉండాలి.

**భూమి :** భూమి, ఇళ్ళ స్థలాల కోసం జరిగే పోరాటం వర్గ పోరాటంలో భాగమే. ఫ్రంట్ అఖిల భారత సదస్సులు ఈ అంశాన్ని విపులంగా చర్చించి తగినన్ని భూపోరాటాలు జరగడం లేదని ఆత్మ విమర్శనాత్మకంగా విశ్లేషించాయి. చాలా పిలుపులు కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలు అవుతున్నాయి. చాలా వరకు భూ పోరాటాలు ప్రభుత్వ భూములు, సాధారణ భూములు, ఇళ్ల స్థలాలకే పరిమితమయ్యాయి. భూస్వాముల భూమిపై నామమాత్రపు పోరాటాలు జరుగుతున్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనిట్లు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్‌లోని కొన్ని జిల్లాలు, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని చోట్ల నిత్యం భూ పోరాటాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో వివిధ కేంద్రాల్లో పోరాటాలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 22 రూరల్ జిల్లాల్లో 1,22,577 ఎకరాల భూమిని సంఘం గుర్తించింది. కొన్ని పోరాటాలు పార్టీ బ్యానర్‌లో, ఐక్య సంఘాల కమిటీల క్రింద మరికొన్ని స్వతంత్రంగా ఫ్రంట్‌చే నిర్వహించబడుతున్నాయి. ఈ పోరాటాల వల్ల భూమిలేని గ్రామీణ పేదలు వేల ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారు.

ఏ.పిలో రాయలసీమ ప్రాంతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. 12 జిల్లాల్లోని 211 కేంద్రాల్లో 82,168 ఎకరాల భూమిని గుర్తించి ఆక్రమించారు. మహారాష్ట్రలోని మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాల్లోని 7-8 జిల్లాల్లో భూపోరాటం జరుగుతోంది. గ్రామ ఉమ్మడి భూముల నుండి నిర్వాసితులను తొలగించే సమస్యపై భారీ, మిలిటెంట్ పోరాటాలు జరుగుతున్నాయి. మూడు డివిజనల్ కమిషనర్ కార్యాలయాల వద్ద ఏకకాలంలో చైతన్యయాత్రలతో పాటు వివిధ స్థాయిల్లో నిరవధిక ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్రంట్ యొక్క కర్ణాటక మరియు తమిళనాడు యూనిట్లు 5-7 జిల్లాల్లో పోరాటాలు నిర్వహించాయి. దేవదాసీ మహిళలకు భూ యాజమాన్యం కోసం కర్నాటకలోని కొప్పల్ జిల్లాలో విజయవంతమైన భూ పోరాటం జరిగింది. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో భూపోరాటాలు తక్కువగా ఉన్నాయి, అయితే గత కొద్దికాలంగా కొన్ని జిల్లాల్లో కొన్ని పోరాటాలు జరిగాయి. ఇటీవల బీహార్‌లో కొన్ని జిల్లాల్లో భూ పోరాటాలు బాగా జరుగుతున్నాయి. రాజస్థాన్‌లో ఒక జిల్లాలో భూ పోరాటం కొన్ని సంవత్సరాలుగా నిరంతరంగా జరుగుతున్నది.

## అటవీ భూములు

అటవీ భూముల కోసం అనేక పోరాటాలు నిర్వహించాం. అటవీ భూములపై యాజమాన్య హక్కుల కోసం త్రిపురలో రైతు సంఘాలతో కలిసి ఉమ్మడి పోరాటాలు నిర్వహించాం. ఈ పోరాటంలో 80,000 మంది గ్రామీణ పేదలు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్ష ఎకరాల అటవీ భూములను గుర్తించి వేలాది ఎకరాల ఆక్రమణలకు పోరాటం సాగిస్తున్నాం. ఆక్రమిత అటవీ భూములను ఆదివాసీలు, భూమిలేని దళితులు, వెనుకబడిన వర్గాల వారికి, గ్రామీణ పేదలకు పంపకం చేశాం. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో పోరాటాలు నిర్వహించాం. వేలాది ఎకరాల అటవీ భూములు సాగు చేసుకుంటున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలలో ఇటువంటి పోరాటాలే నిర్వహించాం. కొన్ని రాష్ట్రాలలో రైతు సంఘంతో కలిసి ఉమ్మడి పోరాటాలు చేపట్టాం. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కూడా అటవీ భూముల కోసం పోరాటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ ఉనికిలో ఉన్న రాష్ట్రాల్లో ఆ సంఘంతో కలిసి ఉమ్మడి పోరాటాలు చెపట్టారు.

## ఇళ్ళ సమస్య

పోరాటం ఇళ్ళ పట్టాల సాధనకే పరిమితం అయ్యింది. ప్రభుత్వం నిర్ణయించిన నివాస గృహాల కేటాయింపు పథకాలు సరిగ్గా అమలు కావడంలేదు. ఇందులో విచ్చలవిడిగా అవినీతి చోటు చేసుకుంటుంది. గ్రామీణ ప్రాంత పేదలు నివాస గృహాల సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం గత మహాసభలలో ఈ సమస్యపై తక్షణ కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పింది. ఇందుకు అనుగుణంగా కేరళలో 1871 గ్రామల నుంచి 1.95 లక్షల మందిని ఇండ్ల సమస్య మీద కదిలించారు. కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం 3.40 లక్షల కుటుంబాలకు ఇళ్ళు కట్టించి పట్టాలు ఇచ్చింది.

త్రిపుర రాష్ట్రంలో వివిధ స్థాయిలలో మొత్తంగా 16,794 మందిని ఇళ్ళ సమస్యమీద కదిలించగలిగాం. కర్నాటక లోని కొన్ని జిల్లాలలో ఈ సమస్యపై నిరంతరం పోరాటం కొనసాగుతుంది. ఇళ్ళ పట్టాల కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో సమరశీల పోరాటాలు నిర్వహించాం. 45 కేంద్రాలలో 60,000 కుటుంబాలు ఇళ్ల స్థలాలను ఆక్రమించుకున్నాయి. కొన్ని జిల్లాలలో మన సంఘం జెండా కింద పోరాటాలు జరిగాయి. మరికొన్ని జిల్లాలలో ఉమ్మడి పోరాటాలు నిర్వహించాం. 'జల్ జీవన్, జంగిల్' పేరిట బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కాలవగట్ల వెంబడి ప్రభుత్వం భూముల్లో

నివసిస్తున్న ప్రజలను నిర్వాసితులను చెయ్యడానికి వ్యతిరేకంగా కొన్ని జిల్లాలలో పోరాటం చేపట్టాం. హర్యానాలోని మూడు జిల్లాలలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ప్రజలను నిర్వాసితులను చెయ్యడానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించాం. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ళ సమస్యలపై పోరాటం ప్రారంభం అయ్యింది.

## సామాజిక సంక్షేమ పథకాలు

కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం, అలాగే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నయా–ఉదారవాద ఆర్థిక విధానాలు అవలంభిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఈ మధ్యనే తరువాయి దశ సంస్కరణల అమలుకు పూనుకున్నాయి. కోవిడ్ విపత్కర పరిస్థితులను అడ్డం పెట్టుకుని మలిదశ సంస్కరణల అమలుకు పూనుకోవడం ద్వారా సామాజిక సంక్షేమ పథకాలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. కొన్ని పథకాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. సామాజిక సంక్షేమ పథకాల సమగ్ర అమలు కోసం మన సంఘం చొరవ తీసుకుని అనేక పోరాటాలు నిర్వహించింది. సామాజిక సంక్షేమ పెన్షన్ల సాధన కోసం దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలు సాగించాం.

నయా ఉదారవాద విధానాలను జోరుగా అమలు చేస్తూ అందులో భాగంగా సామాజిక సంక్షేమ పథకాలకు గండి కొడుతున్న పాలక పార్టీలు తీరా ఎన్నికలు వచ్చేసరికి కొత్త కొత్త సంక్షేమ పథకాలకు వాగ్దానాలు చేస్తున్నాయి. హడావుడిగా కొన్ని అమలు చేస్తున్నాయి. ప్రజలను ఆకర్షించడానికి బిజిపి పాలిత రాష్ట్రాలు కూడా ప్రజలను ఆకర్షించడానికి వివిధ సామాజిక సంక్షేమ పథకాలు ప్రకటించాయి. ఈ పథకాలను మెరుగ్గా అమలు చేయించడంలో భాగంగా గామీణ ప్రజానీకాన్ని సమీకరించగానికి ఈ పథకాలు మనకు అవకాశాల్ని కల్పిస్తున్నాయి.

## ప్రజాపంపిణీ వ్యవస్థ

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యల మీద మన సంఘం ఎప్పటికప్పుడు ఆందోళనలకు పిలుపునిస్తుంది. ప్రత్యేకించి కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ డిమాండ్ మీద పోరాటం సాగించాం. విధానపరమైన అంశాలతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఈ పథకంలో అమలులో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగిస్తున్నాం. ఆహార ధాన్యాలతో పాటు ఇతర నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేయ్యాలని మనం డిమాండ్ చెయ్యాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్రియ అమలు కోసం చేసే పోరాటాలు ఫలితాలను ఇస్తాయి. తద్వారా గ్రామీణ ప్రజానీకంలో

మన సంఘం విస్తరించడానికి అవకాశాలు ఏర్పడతాయి. సమయోచితంగా మన సంఘం ఈ సమస్యలపై జోక్యం చేసుకునేందుకు పార్టీ తగిన సహాయం అందించాలి.

## కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం

దళితుల హక్కుల పరిరక్షణకు, కుల వివక్షకు వ్యతిరేకంగా మన సంఘం నిరంతర పోరాటం సాగిస్తుంది. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అత్యాచార నిరోధక చట్టాన్ని నీరు కార్చే విధంగా 2018 మార్చి 20న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మన సంఘం చురుగ్గా పాల్గొంది. హత్‌రాస్‌లో మానభంగానికి, ఆపై హత్యకు గురయిన దళిత యువతి కుటుంబానికి సంఘీభావంగా నిలవడానికి వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక సంఘం, రైతు, మహిళా సంఘాల బృందం ప్రత్యక్షంగా కలిసి వచ్చింది. 2020 అక్టోబర్ 20న మూడు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశ్యాప్త నిరసనలు జరిగాయి.

పార్టీకి అనుబంధంగా ఉన్న దళిత వేదికలతో కలిసి ఉమ్మడి కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నాం. దళితుల సమస్యల పై, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న వివిధ సంఘాలను ఒకే వేదిక మీదకు తీసుకురావడానికి గత మూడేళ్ళుగా కృషి కొనసాగుతుంది. ఇతర వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాలతో కలిసి 2020 డిసెంబర్ నుండి 2021 జనవరి వరకు పెద్ద ఎత్తున ఉమ్మడి ప్రచారం చేపట్టాం. జాతీయ స్థాయిలో దళితుల సమస్యల పై రెండు సదస్సులు నిర్వహించాం. వీటికి కొనసాగింపుగా రాష్ట్రాల వారీగా సదస్సులు జరిగాయి. 2020 డిసెంబర్ 21న తొలి జాతీయ సదస్సును నిర్వహించగా 2022 నవంబర్ 5న ఢిల్లీలో మలి విడత జాతీయ సదస్సు నిర్వహించాం. వివిధ స్థాయిలలో పనిచేస్తున్న చిన్నా పెద్దా సంస్థలు, సంఘాలు అనేకం కలిసి రావడంలో దళిత సమస్యల పై విశాల వేదికను ఏర్పాటు చెయ్యడం సాధ్యపడింది. చివరగా 2023 ఆగస్టు 26-27 తేదీలలో హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జాతీయ దళిత సదస్సు నిర్వహించాం. ఈ సదస్సులో వందకుపైగా సంఘాలు పాల్గొన్నాయి. సమగ్రమైన కోర్కెల పత్రాన్ని రూపొందించాం. ఈ సదస్సు నుండే దళిత హక్కుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేశాం.

ఈ కోర్కెల పత్రాన్ని భారత రాష్ట్రపతికి సమర్పించడానికి సంతకాల సేకరణ చేపట్టాం, 2023 డిశంబరు 4న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బహిరంగసభ నిర్వహించాం. వేలాది మంది దళిత కార్యకర్తలు ఉత్సాహంగా సభలో పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ ప్రతినిధులు అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులను కలిసి ఆయా పార్టీల ఎన్నికల ప్రణాళికలో ఈ కోర్కెల పత్రంలోని అంశాలను పొందుపరచమని కోరాం. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం భా.జ.పా ని ఓడించడం. మొదటి సారిగా, వ్యవసాయ కార్మిక రంగం అనేక కొత్త చిన్న చిన్న సంఘాలతో కలిసి పని చెయడం ద్వారా విలువైన అనుభవాలు గడించింది. సామాజిక న్యాయ సాధన కోసం జరిగే పోరాటంలో గ్రామీణ కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గ సంఘాలు చురుగ్గా పాల్గొనడం ద్వారా అస్తిత్వవాద రాజకీయ ధోరణులు, కట్టడి చెయ్యడానికి వీలుపడింది. ఈ క్రమంలో మన క్యాడర్‌లో వర్గపోరాట ప్రాధాన్యత పలుచనయ్యి అస్తిత్వ వాద రాజకీయాల ప్రభావం పెరిగే ప్రమాదమూ ఉందనే ఆలోచనతో మన క్యాడర్‌కు రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ ఇచ్చాము.

వివిధ రాష్ట్రాల నుండి అందుతున్న నివేదికలను పరిశీలిస్తే ఎన్నికలలో లబ్దిపొందడానికి దళితులను రాజకీయంగా వాడుకోవడానికి భాజపా పెద్ద ఎత్తున కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే గ్రామీణ పేదలలో నెలకొన్న ఐక్యతను దెబ్బతీసి వారిని విభజించే పన్నాగాలు పన్నుతుందని తెలియవస్తుంది. కాబట్టి వ్యవసాయ కార్మిక సంఘం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడం మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి. దళిత వేదికకు పార్టీకి మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలి.

## హిందూత్వ భావజాల వ్యతిరేక పోరాటం

హిందూత్వ శక్తులు విసురుతున్న సవాలును ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి అనేది సంఘం కమిటీ సమావేశాల్లో చర్చించాం. సంఘం 22వ జాతీయ మహాసభలో హిందూత్వ భావజాల వ్యతిరేక పోరాటాన్నే ప్రధాన కర్తవ్యంగా నిర్ణయించుకున్నాం. 23వ జాతీయ మహాసభలో ఈ నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాడాలని పిలుపు ఇచ్చాం. ఈ పిలుపులకు అనుగుణంగా మన సంఘం ఉదారవాద విధానాలు నిలవరించడానికి ఆర్థిక సమస్యల మీదా, హిందూత్వ, భావజాలానికి వ్యతిరేకంగా భావజాల రంగాల్లో పోరాటం చేపట్టాం. మతతత్వం, హిందూత్వ, భావజాలం మీద క్రమం తప్పకుండా సైద్ధాంతిక శిక్షణా తరగతులు, నిర్వహిస్తున్నాం. రాష్ట్ర స్థాయి, అఖిల భారత స్థాయిలలో నిర్వహించిన శిక్షణా తరగతులలో 'మతతత్వం – హిందూత్వవాదం' మీద ప్రత్యేకంగా ఒక క్లాసు నిర్వహిస్తున్నాం. అయితే ఈ క్లాసులు వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేసే క్యాడర్‌కే పరిమితం అయ్యాయి. వ్యవసాయ కార్మికులు, వారి కుటుంబాల్లో

హిందూత్వ వ్యతిరేక భావజాలాన్ని తీసుకు వెళ్లడంలో వెనుకబడ్డాం అని ఆత్మవిమర్శనా పూర్వకంగా చెప్పుకోవాలి. మనం మన రోజువారీ పనిలో ఆందోళనా కార్యక్రమాల్లో హిందూత్వ వ్యతిరేక భావజాలాన్ని పెద్ద ఎత్తున చొప్పించాల్సిన అవసరం ఉంది.

## మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటం

మన సంఘం మహిళా వ్యవసాయ కార్మికులకు సంబంధించిన ప్రత్యేక సమస్యల మీద కృషి చేస్తుంది. చెరుకు నరికివేత మహిళా కార్మికులలో పోరాటాలు పెంపొందించే కృషి ఒక మేరకు విజయవంతం అయ్యింది. కూలి, పని పరిస్థితులు, ఆరోగ్యపరమైన రక్షణలు ప్రధాన అంశాలుగా పోరాటాలు నిర్వహించాం. అన్ని స్థాయిలలో మహిళల నాయకత్వాన్ని పెంపొందించడానికి కొంత కృషి చేశాం. గ్రామ కమిటీలలో కనీసంగా ఒక మహిళకు ప్రాతినిధ్యం కల్పించేలా కేరళ శాఖ విధానపరమైన నిర్ణయం తీసుకున్నది. అన్ని రాష్ట్రాలలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో మహిళా వ్యవసాయ కార్మికుల సదస్సులు నిర్వహించాలి. హిందూ భాషా ప్రాంత రాష్ట్రాలలో కూడా ఈ అజెండాను చేపట్టారు. అయితే చాలా రాష్ట్రాలు మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యను చేపట్టడంలో అశ్రద్ధ వహిస్తున్నాయి. మహిళా వ్యవసాయ కార్మికుల జాతీయ సదస్సు నిర్వహించాలని గత మహాసభలో తీర్మానించాం.

పురుషకార్మికులతో పోలిస్తే మహిళా కార్మికులకు తక్కువ ఉపాధి అవకాశాలు ఉండడం, కూలి తక్కువగా ఉండడం, వ్యవసాయేతర పనులు చేపట్టడానికి అవకాశాలు తక్కువగా ఉండడం వంటి సమస్యలను ప్రధానంగా ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులలో మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యలపట్ల మనం మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## లాక్‌డౌన్ కాలంలో సహాయక కార్యక్రమాలు

లాక్‌డౌన్ కాలంలో మన సంఘం వివిధ సహాయక కార్యక్రమాలు చేపట్టింది. కేరళలో వేలాది మంది మన కార్యకర్తలు ఆహారం, మందులు తదితర నిత్యావసరాల పంపిణీలోను, ఇతర సహాయ కార్యక్రమాల్లోను పాల్గొన్నారు. కూరగాయల పెంపకానికి ప్రత్యేకమైన కృషిచేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో శ్లాఘనీయమైన కృషిసల్పారు. రేషన్ పంపిణీతోపాటు అతిథి (వలస) కార్మికుల కోసం వంట శాలలు నిర్వహించారు. ఒకటిన్నరకోటి రూపాయల విలువ చేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. బెంగాల్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, హర్యానా,

బీహార్, ఒడిషా, త్రిపుర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో మన శక్తి మేరకు సహాయక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అతిథి కార్మికులు, కూలి జనం నివసించే ప్రాంతాలలో కోవిడ్ వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు.

## ఉమ్మడి పోరాటాలు

కార్మిక సంఘాలు, రైతు సంఘాలతో కలిసి ఉమ్మడి ఆందోళనలు, ఐక్యపోరాటాలలో మన సంఘం చురుగ్గా పాల్గొన్నది. అలాగే ఇతర వ్యవసాయ కార్మిక సంఘాలలో కలిసి ఐక్యకార్యాచరణ చేపట్టింది. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపులో వ్యవసాయ కార్మిక సంఘం పాల్గొన్నది. మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ వేదిక ఇచ్చిన పిలుపు మేరకు 2018 సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో, కార్మిక-కర్షక ఐక్య సంఘటనలతో కలిసి పాల్గొన్నది.

లాక్‌డౌన్ సమయంలో కూడా ఈ మూడు ఐక్య వేదికలు సృజనాత్మకంగా, వరుసవారీగా చేపట్టిన ఆందోళనలు ప్రజల మీద గట్టి ప్రభావం చూపాయి. 2023 ఏప్రిల్ 5న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ వేదిక ఆధ్వర్యంలో పెద్ద ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో వేలాది మంది రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు కానీ మన సమీకరణ ఆశించిన స్థాయిలో లేదు. క్షేత్ర స్థాయిలో మూడు సంఘటనల మధ్యన మరింత సమన్వయం పెరగాల్సిన అవసరం ఉంది.

## వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన చారిత్రక రైతు ఉద్యమం

భాజాపా ప్రభుత్వం చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన చారిత్రక పోరాటంలో వ్యవసాయ కార్మిక సంఘం చురుగ్గా పాల్గొన్నది. ఢిల్లీ చుట్టు పక్కల రాష్ట్రాల నుండి వివిధ సందర్భాలలో వివిధ సరిహద్దుల వద్దకు సమీకరణ జరిగింది. మూడు వ్యవసాయ చట్టాలు వ్యవసాయ కార్మికుల మీద ఎలాంటి ప్రభావం కలుగచేస్తాయో వివరిస్తూ మన సంఘం విడిగా కరపత్రాల ముద్రణ తదితర రూపాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగించింది. వ్యవసాయ కార్మికులు ఉద్యమంలో ఎందుకు భాగస్వాములు కావాలో వివరించింది. ఈ చట్టాల్లో ముఖ్యంగా నిత్యావసరాల సరుకుల చట్టం ప్రజా పంపిణీ వ్యవస్థను ఎలా దెబ్బతీస్తుంది, వ్యవసాయ కార్పొరేటీకరణ మూలంగా ఉపాధి అవకాశాలు ఎలా దెబ్బతినిపోతాయి, అలాగే చట్టాలు భూమి

కోసం జరిగే పోరాటాలను ఎలా దెబ్బతీస్తాయో వ్యవసాయ కార్మికులతో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టింది మన సంఘం. యస్.కె.యం ఇచ్చిన అన్ని పిలుపులలో చురుగ్గా పాల్గొన్నాం. అలాగే మన సంఘం తరఫున స్వతంత్రంగా ఆందోళనలు కూడా నిర్వహించాం. ఇతర వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాలను కూడా కూడగట్టి ఐక్యంగా ఉద్యమించడం, సంఘీభావంగా నిలవడం చేపట్టాం. కేంద్ర స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘం యస్.కె.యంలో భాగస్వామికాదు. అయినా కూడా రాష్ట్రాల స్థాయిలో యస్.కె.యం, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులలో భాగస్వామి అవుతూ కార్మిక – కర్షక మైత్రిని పెంపొందించేందుకు, వ్యవసాయరంగం మీద నయా–ఉదారవాద విధానాల ప్రభావానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమాలను బలోపేతం చేసేందుకు కృషి చేసింది.

## వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ

వ్యవసాయ కార్మిక రంగంలో పనిచేస్తున్న వామపక్ష సంఘాలు అన్నిటినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి తరువాత అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్, ఆలిండియా అగ్రగామి కృషి శ్రామిక్ యూనియన్, వ్యవసాయ గ్రామీణ పేదల సమాఖ్య, ఆలిండియా సంయుక్త కిసాన్ సభ – ఈ ఐదు సంఘాలూ ఉమ్మడిగా అందోళనలు చేపట్టాలని, అఖిల భారత సదస్సు నిర్వహించాలని నిర్ణయించాయి.

ఈ సంఘాల మధ్యన సమన్వయం పెరిగింది. కానీ వి.ఐ.వి.ఆర్.యల్.ఎ. స్పందన సరిగా లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, సామాజిక న్యాయం – అంశాలపై ఐదు సంఘాలూ, ఐక్యపోరాటాలు నిర్వహించాయి. సమస్యల మీద నిరంతరంగా ఆందోళనలకు పిలుపునిస్తున్నాయి. ఈ ఐదు సంఘాల మధ్య సమన్వయం మరింతగా బలపడితే సమరశీల ఐక్యపోరాటాలు మరింతగా పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కౌలురైతుల సమస్యలను కూడా చేపట్టారు. అలాగే మన వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కో–ఆర్డినేషన్ కమిటీలో భాగస్వామిగా ఉన్నది. ఈ సంస్థలోనూ, ప్రత్యేకించి బి.ఎ.ఎ.లోనూ పని చెయ్యడానికి మరింత కృషి చెయ్యాల్సిన అవసరం ఉంది.

# 4.నిర్మాణం

22వ పార్టీ మహాసభలో వ్యవసాయ కార్మిక రంగంలో నిర్మాణం బలోపేతం గావించుకోవడానికి కొన్ని లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. ఆలిండియా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి, మన సంఘం ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు విస్తరించాలి, ప్రాథమిక కమిటీలు చురుకుగా పని చేసేలా చూడాలని నిర్దేశించుకున్న లక్ష్యాలను అమలు చెయ్యడానికి గత నాలుగేళ్ళుగా కృషి జరిగింది.

## రాష్ట్ర శాఖలు

22వ పార్టీ మహాసభ తర్వాత వ్యవసాయ కార్మిక సంఘం కొత్త రాష్ట్రాలకు విస్తరించింది. మన సంఘానికి పదహారు రాష్ట్రాలలో రాష్ట్రకమిటీలున్నాయి. మరో నాలుగు రాష్ట్రాలలో మన సంఘం ఉనికిలో ఉన్నది. హైదరాబాద్ మహాసభల నాటికే మన సంఘం 16 రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తుంది. వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభకు ఇరవై రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. కొన్ని రాష్ట్రాల్లో మన సంఘానికి రాష్ట్ర కమిటీలు ఉన్న కొన్ని జిల్లాలలో మాత్రమే మన ప్రాతినిధ్యం ఉన్నది. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్‌లో 75 జిల్లాలు ఉంటే మన సంఘం 16 జిల్లాలకే పరిమితమై ఉన్నది, మరీ 12జిల్లాలలో ఆర్గనైజింగ్ కమిటీలు ఉన్నాయి. మహారాష్ట్ర, కర్నాటక, రాజస్థాన్, హర్యానా, ఒడిషా, బీహార్ రాష్ట్రాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నది. మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలో మన కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయి. అసోంలో రాష్ట్ర కమిటీల ఏర్పడి 8 జిల్లాలలో సభ్యత్వం చేర్పిస్తుంది. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలలో కొన్ని సంబంధాలు వచ్చాయి. కానీ వాటిని ఇంకా నిర్మాణంలో ఇముడ్చుకోవాల్సి ఉంది. సంఘం విస్తరించింది. కాని అది నామమాత్రమే. హోల్‌టైమర్స్ కేటాయింపు సజావుగా, సరిపడ ఉండాలి.

వివిధ రాష్ట్ర కమిటీలలో ఉన్న సభ్యుల సంఖ్య 813. ఇందులో 111 మంది మాత్రమే మహిళలు. అంటే మహిళల ప్రాతినిధ్యం కేవలం 13.65 శాతం మాత్రమే. కేరళ మినహా ఏ రాష్ట్ర శాఖ కూడా మహిళా సభ్యుల సంఖ్య ఎంత అన్న సంఖ్య వివరాలను తెలియచెయ్యలేదు. మహిళా సభ్యుల సంఖ్య వివరాలను నమోదు చెయ్యాలి. వివిధ స్థాయిలలోని కమిటీలలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. కాబట్టి కమిటీలలో మహిళల ప్రాతినిధ్యం పెంచడం మీద దృష్టిపెట్టాలి.

రాష్ట్ర కమిటీల సంఖ్య పెరిగింది కానీ ఆయా కమిటీల పనితీరు ఇంకా చాలా మెరుగుపడాలి. కేరళ, బెంగాల్, త్రిపుర, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు

రాష్ట్రాలలో రాష్ట్ర కమిటీ సమావేశాలు క్రమబద్ధంగా 70 నుండి 75 శాతం హాజరుతో జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర కమిటీలు రాజకీయ, నిర్మాణ, విధానపరమైన అంశాలపై చర్చలు జరుపుతున్న ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో అది మన పోరాటాల్లో ప్రతిఫలిస్తుంది. సైద్ధాంతిక, రాజకీయ అంశాల మీదనే కాకుండా ఈ కమిటీలు గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై కూడా పోరాటాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర కమిటీల పనితీరు మెరుగుపడుతుంది. అఖిల భారత కేంద్రం ఇచ్చిన పిలుపులను అమలు చేస్తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలలో కూలిరేట్లు, భూయాజమాన్య హక్కులు, నివాస స్థలాలు వంటి వర్గ సమస్యల మీద మరింత కేంద్రీకరించి పనిచెయ్యాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ కార్మిక సంఘం కన్నూర్ మహాసభలో స్థానిక సమస్యలను గుర్తించి స్థానిక పోరాటాలు పెంపొందించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. కొన్ని రాష్ట్రాలలో ఈ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి నిర్థిష్టమైన ఫలితాలను సాధించారు. చాలా రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాలలో స్థానిక సమస్యల మీద కేంద్రీకరించి పని చెయ్యడంలో బలహీనతల మూలంగా సంతృప్తికరమైన ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోతున్నాం. రాష్ట్రకమిటీలు ఆ రాష్ట్రాల్లో నెలకొని ఉన్న సమస్యలను నిర్థిష్టంగా అధ్యయనం చెయ్యడానికి మరింత సమయం కేటాయించి ఆయా రాష్ట్రాలలో నెలకొని ఉన్న నిర్థిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఆ సమస్యలపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టడం తద్వారా వ్యవసాయ కార్మికులను, పేదలను భారీగా సమీకరించి ఉద్యమించాలి. అలాగే రాష్ట్ర కమిటీలు యువ కార్యకర్తలను గుర్తించి, తర్ఫీదు ఇచ్చి నాయకత్వ బాధ్యతలలోకి తీసుకురావాలి. తద్వారా మనం కొత్త సంబంధాలు తెచ్చుకుని ప్రజలలో మన పునాదిని బలోపేతం చేసుకునే దానికి అవకాశం ఉంటుంది.

కొన్ని రాష్ట్రాలలో రాష్ట్ర కేంద్రాలు చురుగ్గాపని చెయ్యడం లేదు. కేరళ, బెంగాల్, ఆంధ్రా, తెలంగాణా, త్రిపుర, తమిళనాడు, మహారాష్ట్రాలలో రాష్ట్ర కేంద్రాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలలో ఒకరిద్దరు కామ్రేడ్స్ రాష్ట్ర కేంద్రం నుండి పనిచేస్తున్నారు తప్పితే పూర్తి స్థాయిలో కేంద్రంలో లేరు. కార్యకర్తలు కొరతతోపాటు, నిధుల కొరత కూడా ఉంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఈ బలహీనత ఎక్కువగా ఉంది. రాష్ట్ర నాయకులు కేంద్రం నుండి పనిచేసేలా పార్టీ నిర్ణయించాలి. రాష్ట్ర కేంద్రలోకి నూతన క్యాడరును తెచ్చుకోవాలి. అలాగే రాష్ట్ర కేంద్రం కర్యాకలాపాలకు తగిన నిధులు సమకూర్చాలి.

## జిల్లా కమిటీలు

మన సంఘం 271 జిల్లాలో సభ్యత్వం చేర్పించింది. 235 జిల్లాలలో జిల్లా కమిటీలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ పార్టీ మహాసభ నాటికి 205 జిల్లా కమిటీలు పనిచేస్తున్నాయి. ఈ సమీక్షా కాలంలో రాష్ట్ర కమిటీల పనితీరు మెరుగుపడింది కానీ జిల్లా కమిటీల పనితీరు ఆందోళకరంగా ఉన్నది. కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో జిల్లా కమిటీల పనితీరు సంతృప్తికరంగా ఉన్నది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో సగం జిల్లా కమిటీల సమావేశాలే సక్రమంగా జరగడంలేదు, స్వతంత్ర పని విధానమూ కొరవడింది. ఉత్తరాది రాష్ట్రాలలో ప్రతిరాష్ట్రంలో నాలుగైదు, జిల్లా కమిటీలు మాత్రమే క్రమం తప్పకుండా సమావేశం అవుతూ, స్వతంత్ర కార్యాచరణ చేపడుతున్నాయి. అన్ని రాష్ట్రాలలో జిల్లా కమిటీల సంఖ్య పెరిగింది కానీ, కార్యకలాపాలు తుగ్గుముఖం పట్టాయి.

## గ్రామ శాఖలు

దేశవ్యాప్తంగా మన సంఘానికి 24,933 గ్రామీణ శాఖలున్నాయి. ఇందులో 13,025 శాఖలు అంటే సుమారుగా సగానికి పైగా శాఖలు మాత్రమే చురుగ్గా పనిచేస్తున్నాయి. కేరళ, బెంగాల్, త్రిపుర, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో ఎక్కువ గ్రామీణ శాఖలున్నాయి. కేరళ మినహా మిగతా రాష్ట్రాలలో సభ్యత్వ చేర్పింపు, శాఖలు వెయ్యడం మినహా కొనసాగింపు కార్యక్రమాలు లేవు. మరిన్ని గ్రామీణ శాఖల ఏర్పాటుతో పాటు శాఖలన్నింటినీ చురుగ్గా పనిచేయించే నిర్మాణపరమైన లక్ష్యాన్ని తీసుకోవాలి.

## అఖిల భారత కేంద్రం

ఆలిండియా కేంద్రంలో ప్రస్థుతం నలుగురు కామ్రేడ్స్ పనిచేస్తున్నారు. హైదరాబాద్ పార్టీ మహాసభ తర్వాత ఇద్దరు కొత్త కామ్రేడ్స్‌ను సంఘం ఆలిండియా కేంద్రానికి రిక్రూట్ చేసుకున్నాం. కేంద్రం పనితీరు మెరుగుపడింది, ఐక్యంగానే ఉంది. కేంద్రం నుండి క్రియాశీలమైన జోక్యం పెరిగింది. కేంద్రంలో అందుబాటులో ఉన్న కామ్రేడ్స్ తరచుగా కలుసుకోవడంతోపాటు నెలవారీగా కామ్రేడ్స్ అందరూ సమావేశం అవుతున్నారు, కేంద్రంలోని బాధ్యులు క్రమం తప్పకుండా వివిధ రాష్ట్రాల్లో జరిగే సమావేశాలకు, కార్యక్రమాలకు హాజరవుతున్నారు పార్టీ ప్లీనం నిర్దేశించినట్లు కేంద్రంలో బాధ్యులు ఆయా రాష్ట్రాల్లో పనికి, కింద స్థాయి కమిటీ సమావేశాలకు

కూడా సమయం కేటాయిస్తున్నారు. వివిధ రాష్ట్రాలలోజరిగే ఆందోళనలలో పాల్గొంటున్నారు. కీలకమైన సమస్యలు, అంశాలపై కరపత్రాలు, సర్క్యులర్‌ల, ప్రచార సామాగ్రి రూపొందించి రాష్ట్రాలకు పంపిస్తున్నారు. ఆలిండియా కేంద్రాన్ని మరింత బలోపేతం చెయ్యడానికి మరో ఇద్దరు కామ్రేడ్స్‌ని, అందులో ఒకరిని కేరళ నుండి రిక్రూట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆలిండియా కేంద్రంలో ఇద్దరు కామ్రేడ్స్ ఆఫీసు నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఆఫీసు క్రీయాశీలంగా పనిచేస్తుంది. రాష్ట్రాలతో నిరంతర సంబంధాలు నెరుపుతుంది. విధానపరమైన నిర్ణయాలకు సంబంధించిన సమాచారాన్ని అన్ని రాష్ట్ర కమిటీలకు అందించే కృషి జరుగుతుంది. సెంట్రల్ ఆఫీసులో కనీసం మరో ఇద్దరు యువ కామ్రేడ్స్‌ని రిక్రూట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఆఫీసు బేరర్లు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ, జనరల్ కౌనిల్స్ సభ్యులు

15 మంది ఆఫీసు బేరర్లు, 61 మంది వర్కింగ్ కమిటి సభ్యులు, 155 మంది జనరల్ కౌన్సిల్ సభ్యులున్నారు. ప్రతి మూడు నెలలకు వర్కింగ్ కమిటీ సమావేశాలు, ఏడాదికి ఒకసారి జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయి. అవసరాన్ని బట్టి ఆన్-లైన్ సమావేశాలు జరుగుతున్నాయి. కోవిడ్ కాలంలో ఆన్-లైన్ సమావేశాలే జరిగాయి. కమిటీ సభ్యులు చురుగ్గా ఉన్నారు. ఏటా జరిపే జనరల్ కౌన్సిల్ సమావేశాలు అఖిల భారత మహాసభలో నిర్మాణం పై పెట్టుకున్న లక్ష్యాల సాధన దిశగా నిర్వహించుకోవాలి. తీసుకున్న కార్యక్రమాలు అమలు మీద సెంట్రల్ వర్కింగ్ కమిటీ, ఆఫీసు బేరర్లు సమావేశాల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించు కుంటున్నాము.

సంఘ సభ్యత్వం నిలకడగా పెరుగుతూ వస్తుంది. 2018లో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ మహాసభ నాటికి సంఘ సభ్యత్వం 74,43,063 కాగా 2022-23 నాటికి అది 79,60,154కు చేరుకుంది. దాదాపు ఐదు లక్షల సభ్యత్వం పెరిగింది. ఇందులో కేరళ సభ్యత్వం 33.88 శాతం కాగా ఐదు దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వం (కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక) 67.02 శాతంగా ఉంది. బెంగాల్ సభ్యత్వం కూడా కలిపితే 89.59 శాతంగా ఉంది. కేరళ మినహా మిగిలిన రాష్ట్రాలలో సభ్యత్వ నమోదు కీలక నాయకుల మీద ఆధారపడి ఉన్నది. సభ్యత్వ

చెల్లింపు కార్యక్రమం నిర్ధిష్ఠ కాలంలో పూర్తి చేయడంలేదు. ఏడాది పొడుగునా ఇది కొనసాగుతూనే ఉంది. అలాగే సభ్యత్వ పెరుగుదల మన సమీకరణ శక్తి, పోరాటాలలో ప్రతిబింబించడం లేదు. కేరళ మినహా ఏ రాష్ట్రంలోనూ సభ్యత్వ స్క్రూటినీ జరుగుతున్నట్లు కనబడడంలేదు.

## నిధులు:

సంఘానికి ప్రధాన ఆదాయ వనరు సభ్యత్వ రుసుము వాటాలే. అకౌంట్ సజావుగా నిర్వహిస్తున్నాము. ముగ్గురు సభ్యులతో ఒక అంతర్గత ఆడిట్ కమిటీ క్రమబద్ధంగా అకౌంట్‌ను పరిశీలిస్తుంది. కమిటీ సమావేశాల్లో అకౌంట్ వివరాలు రిపోర్టు చేస్తున్నాం. ఏటా ఇన్‌కం టాక్స్ రిటర్నులు వేస్తున్నాం. రాష్ట్రశాఖలు కూడా అకౌంట్లను సజావుగా నిర్వహిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలలో అంతర్గత ఆడిటింగ్ జరుగుతుంది.

## సైద్ధాంతిక కృషి:

సంఘం అఖిలభారత స్థాయిలో క్రమం తప్పకుండా క్లాసులు నిర్వహిస్తుంది. 2022 మే 28 నుండి 30 వరకు తిరువనంతపురం లోని ఇ.యం.యస్. అకాడమీలో అఖిలభారత అధ్యయన తరగతులు నిర్వహించుకున్నాం. తొమ్మిది రాష్ట్రాల నుండి 215 మంది ప్రతినిధులు ఈ క్లాసులకు హాజరయ్యారు. హిందీ రాష్ట్రాలకు సంబంధించిన తరగతులు కుల వివక్ష వ్యతిరేక రంగం కలిసి 2021 సెప్టెంబరు 10 నుండి 12 వరకు మొదటిసారిగా నిర్వహించారు. 2023 డిసెంబర్ 20 నుండి 22 వరకు రెండవసారి క్లాసులు నిర్వహించాం. ఈ రెండూ ఢిల్లీలో జరిగాయి. 121 మంది ఈ క్లాసులకు హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో కూడా క్రమం తప్పకుండా క్లాసులు నిర్వహిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ స్థాయిలో కూడా క్లాసులు నిర్వహిస్తున్నారు కానీ అంతకు దిగువ స్థాయిలో క్లాసులు జరగడంలేదు. సంఘ నాయకత్వం పార్టీ నిర్వహించే క్లాసులకు హాజరవుతుంది. అన్ని స్థాయిలలో క్యాడర్ సైద్ధాంతిక రాజకీయ అవగాహనను పెంపొందించే కృషి కొనసాగుతుంది.

ఆలిండియా కేంద్రం నుండి ఇంగ్లీషు, హిందీ భాషలలో బులెటిన్ వెలువరిస్తున్నాం. కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి బులెటిన్‌లు ప్రచురిస్తున్నారు. ఇవి కాకుండా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో కరపత్రాలు, బుక్‌లెట్‌లు తీసుకువస్తున్నాం.

హిందూత్వ భావజాలానికి, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా మన క్యాడర్‌కు రాజకీయంగా, సైద్ధాంతికంగా తర్ఫీదు ఇవ్వడానికి సెమినార్లు కూడా నిర్వహిస్తుంది.

## హోల్‌టైమర్లు:

2010లో వ్యవసాయ కార్మిక రంగం సమీక్ష సమావేశం జరిపేనాటికి 705మంది హోల్‌టైమర్లు సంఘంలో పనిచేస్తున్నారు. కొత్తగా బెంగాల్‌లో మన సంఘం శాఖ ఆరంభించారు. అయినప్పటికీ హోల్‌టైమర్లు సంఖ్య 575కి పడిపోయింది. విప్లవ పార్టీకి ఇది ఆందోళన కలిగించే విషయం. హోల్‌టైమర్లు సంఖ్య తక్కువగా బలహీన రాష్ట్రాల్లో మరింత పలుచగా ఉంది. కాబట్టి రాష్ట్రాల్లో కొత్తగా హోల్‌టైమర్లు రిక్రూట్ చేసుకోడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. ఉత్తరాది రాష్ట్రాలలో హోల్‌టైమర్లుకు చెల్లించే అలవెన్సులు తక్కువగా ఉండడం, సక్రమంగా చెల్లించలేకపోవడం పెద్ద సమస్యగా ఉందని వివిధ కమిటీలు అభిప్రాయ పడ్డాయి. దీనిని తక్షణమే సరిదిద్దాలి. ఈ సంఘంలో పని చేసే హోల్‌టైమర్లు అధికశాతం అణగారిన తరగతుల నుండి వచ్చినవారు కావడం, వేరే ఆదాయమార్గాల లేని కారణంగా పూర్తిగా అలవెన్సుల మీదే ఆధారపడి జీవనం కొనసాగించాల్సి ఉంటుంది. హోల్‌టైమర్ల కుటుంబాలకు తగిన వైద్యసదుపాయాలు, వారి పిల్లల చదువులకు మెరుగైన అవకాశాలు కల్పించే ఒక యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. సంఘం కార్యకలాపాలు నిర్వహించడానికి పార్టు–టైమ్ కార్యకర్తలను గుర్తించడంతో పాటు హోల్‌టైమర్లుగా పనిచెయ్యడానికి మహిళలను, యువ కార్యకర్తలను ఎంపిక చెయ్యడానికి ప్రాధాన్యతను ఇవ్వాలి. కేంద్రకమిటీ, రాష్ట్రకమిటీలు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి.

## ఫ్రాక్షన్ కమిటీలు:

ఆలిండియా కేంద్రంగా వ్యవసాయరంగ సబ్ కమిటీ పనిచేస్తూ ఉంది. రైతు సంఘానికి, వ్యవసాయ కార్మిక సంఘానికి విడివిడిగా ఫ్రాక్షన్ కమిటీలు వెయ్యాలని పార్టీ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2024 జనవరిలో రెండు ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటు చేసింది. తమిళనాడు, త్రిపురలు మినహా అన్ని రాష్ట్రాలలో ఫ్రాక్షన్ కమిటీలు వేశారు. ఈ రెండు రాష్ట్రాలలో వ్యవసాయరంగ ఉమ్మడి సబ్‌కమిటీలు పనిచేస్తున్నాయి.

బలమైన రాష్ట్రాలలో ఫ్రాక్షన్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నడుస్తున్నాయి. ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా బలహీన రాష్ట్రాలలో ఫ్రాక్షన్‌లు సక్రమంగా పనిచేసేలా చూసే బాధ్యత పార్టీ చేపట్టాలి. కొన్ని ఫ్రాక్షన్ కమిటీలు

వ్యవసాయ కార్మికులతో పార్టీ నిర్మాణం కావించాల్సిన కర్తవ్యం గురించి చర్చిస్తున్నాయి. అన్ని ఫ్రాక్షన్ కమిటీలు ఈ అజెండాను చేపట్టాలి. అలాగే సంఘానికి కేటాయించిన కార్యకర్తలు చురుగ్గా పనిచేసేలా చూసే బాధ్యత కూడా ఫ్రాక్షన్‌లు చేపట్టాలి. బలమైన రాష్ట్రాలలో జిల్లాస్థాయిలో కూడా ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పడ్డాయి.

## పార్టీ సభ్యులు:

చాలా రాష్ట్రాలలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలలో ఉన్న పార్టీ సభ్యులను వ్యవసాయరంగంలో పార్టీ సభ్యులుగా లెక్కిస్తున్నారు. కాబట్టి వ్యవసాయ కార్మిక సంఘంలో పార్టీ సభ్యుల సంఖ్యను నిర్దిష్టంగా లెక్కించాలి. పోరాటాలు సందర్భంగా అగ్జిలరీ శాఖలకు పనికి వచ్చే కామ్రేడ్స్ ప్రక్రియ సక్రమంగా జరగడంలేదు. వ్యవసాయ కార్మిక సంఘంలో పార్టీ సభ్యుల పని చురుగ్గా లేకపోవడం బలహీనతగా కొనసాగుతుంది. వ్యవసాయ కార్మిక సంఘంలోని పార్టీ సభ్యులు సంఘం కార్యకలాపాలను ప్రాధాన్యత గావించుకుని పనిచెయ్యడంలేదు.

అనేక క్లిష్ట పరిస్థితుల మధ్య వ్యవసాయ కార్మిక సంఘం పార్టీ నిర్దేశించిన కర్తవ్యాలను అమలు చేసేందుకు చురుగ్గా కృషి చేసింది. కేంద్రాన్ని బలోపేతం చేసుకోవడం, కొత్తజిల్లాలకు, కొత్త ప్రాంతాలకు విస్తరించడం, వివిధ స్థాయిలో కమిటీలను క్రియాశీలంగా పనిచేసేలా చూడడం, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమించడం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడడం – పార్టీ నిర్దేశించిన ఈ కర్తవ్యాలను అన్నింటినీ అమలుచేసింది. హిందీ భాషా ప్రాంతాలలో వీటి అమలులో కొన్ని బలహీనతలు ఎదురవుతున్నాయి. కర్తవ్యాల అమలులో పరిమితులు ఉన్నాయి. స్థానిక, జిల్లా కమిటీలు రెగ్యులర్‌గా పని చెయ్యడంలేదు. కూలిరేట్లు, భూమి సమస్యలపై కేంద్రదీకరించి పనిచెయ్యాలి. వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేస్తున్న పార్టీ కామ్రేడ్స్‌ను స్వతంత్రంగా పనిచెయ్యించక పోవడం, స్థానిక పోరాటాలు పెంపొందించలేక పోవడం వంటి బలహీనతలు ఎదుర్కొంటున్నారు.

## తక్షణ చొరవ చూపించాల్సిన అంశాలు:

పార్టీ శాఖలు ఉండి, వ్యవసాయ కార్మికులు గణనీయంగా ఉన్న ప్రాంతాలలో కూడా మన సంఘం లేని పరిస్థితులు ఉన్నాయి. చాలా జిల్లాలలో మన పార్టీ బలంగా ఉన్నది కానీ ఆయా జిల్లాలలో వ్యవసాయ కార్మిక సంఘంలేదు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలలో పనిచేసే వారిని నిర్మాణంలో ఇముడ్చుకోవాలన్న చైతన్యం చాలా జిల్లాలలో కొరవడింది. కాబట్టి ఆయా రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తరభారత దేశంలో ఈ దిశగా పార్టీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహారాష్ట్రలోని 17 గ్రామీణ జిల్లాలలో మన సంఘం ఉంది కానీ సంప్రదాయంగా బలమైన వ్యవసాయ కార్మికులకు కేంద్రంగా ఉన్న థానేలోనే మన సంఘం ఉనికిలోలేదు. పార్టీ జోక్యం చేసుకోనిదే ఈ జిల్లాలో మనం సంఘాన్ని పునరుజ్జీవింప చేయలేం.

ఉత్తరాదిన పంజాబ్ వ్యవసాయ కార్మికులకు సంప్రదాయంగా బలమైన పునాది రాష్ట్రం. అన్ని జిల్లాలలో మనకు కమిటీలు ఉన్నాయి. అయితే స్థానిక సమస్యలను గుర్తించి ఉద్యమాలు నిర్మించే చొరవ కొరవడింది. యువ కార్యకర్తలను పెంపొందించడం ఇక్కడ పెద్ద సమస్యగా ఉన్నది. ఈ మధ్యకాలంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి సీనియర్ నాయకులు భర్తీ చేసేందుకు క్యాడర్ కరువయ్యారు.

వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వ పెరుగుదల పార్టీ రాజకీయ బలంలో ప్రతిబింబించడం లేదు. తెలంగాణలో 12 లక్షల సభ్యత్వం ఉన్నది. ఈ మధ్యన జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మనం పోటీ చేసిన నియోజక వర్గాలలో దాదాపు 9 లక్షల సభ్యత్వం ఉన్నది. కానీ మనం పోటీ చేసిన 19 సీట్లలో పార్టీకి 52,000 ఓట్లు పోలయ్యాయి. కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లో పార్టీశాఖలు ఉన్న చోటల్లా వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించే కృషి చేపట్టాలి.

## హిందీ రాష్ట్రాలు :

బీహార్‌లోని అన్ని జిల్లాలలో మన సంఘం ఉన్నది కానీ స్వతంత్ర పనివిధానం కొరవడింది. ఫ్రాక్షన్ కమిటీలను పార్టీ పర్యవేక్షించడం ద్వారా ఈ బలహీనతను అధిగమించాలి. ఉత్తరప్రదేశ్‌లో మన పునాది క్రమేపీ బలహీన పడుతున్నది. పార్టీ జోక్యం, పర్యవేక్షణ అవసరం.

బీహార్, ఉత్తరప్రదేశ్ పార్టీ రాష్ట్ర కమిటీలు వ్యవసాయ కార్మిక సంఘాన్ని పునరుత్తేజ పరిచి పోరాటాల నిర్వహణ, నిర్మాణ పరంగా బలోపేతం కావడానికి తగిన మార్గనిర్దేశనం చేయాలి.

రాజస్థాన్‌లోని కొన్ని జిల్లాలలో మన సంఘం పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంత జిల్లాలలో మన పార్టీ చాలా బలంగా ఉంది. అలాగే హార్యానాలోని చాలా జిల్లాలలో మన పార్టీ బలంగా ఉన్నది కానీ వ్యవసాయ కార్మిక సంఘం కొన్ని జిల్లాలకే పరిమితం అయ్యింది. రాజస్థాన్, హర్యానా పార్టీ రాష్ట్ర కమిటీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆ రాష్ట్రాల్లో కొత్త ప్రాంతాలకు కొత్త జిల్లాలకు విస్తరించేలా ప్రణాళిక రూపొందించాలి అందుకు అదనంగా క్యాడర్‌ను కేటాయించాలి.

మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలో మన కార్యకలాపాలు, నామమాత్రంగా ఉన్నాయి. సభ్యత్వ చెల్లింపు, సంఘం పనివిధానం క్రమబద్ధంగా లేదు. ఈ రెండు రాష్ట్రాల పార్టీ రాష్ట్రకమిటీలు వ్యవసాయ కార్మిక సంఘాన్ని విస్తరింపచెయ్యడం మీద దృష్టి పెట్టేందుకు తగిన క్యాడర్‌ను కేటాయించాలి.

## నూతన ఒరవడి అవసరం:

బూర్జువా-భూస్వాముల రాజ్యంగా ఉన్న మన దేశంలో రాజ్యానికి వ్యతిరేకంగా సాగించాల్సిన వర్గపోరాటంలో వ్యవసాయ కార్మికుల పాత్ర చాలా కీలకం. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంపొందించడానికి వ్యవసాయ కార్మిక సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలి. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు పర్యవసానం గ్రామీణ భారతంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో మనం సంఘం నిర్వహించాల్సిన పాత్రను నిర్దేశించుకోవాలి. పాలక వర్గాలతో తలపడడానికి సామాజిక, ఆర్థిక సమస్యల ప్రాతిపదికగా కష్టజీవులందరినీ ఐక్యంచేసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

నూతన వ్యవసాయ పద్ధతులు, యంత్రాల వాడకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నయా ధనికవర్గం తలెత్తింది. వ్యవసాయ వర్గాల మీద ఒక అధ్యయన బృందం విడుదల చేసిన నివేదికలో చాలా మంది భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు వడ్డీ వ్యాపారం, బియ్యం మిల్లులు, పాడిపరిశ్రమ, పూలతోటల పెంపకం, ఆహారధాన్యాల, అపరాల వ్యాపారం, రియల్‌ఎస్టేట్, నిర్మాణరంగం, వస్తూత్పత్తి రంగం, పెట్రోల్ పంపులు, హోటళ్ళు, రవాణారంగం, వ్యవసాయ యంత్రాల అమ్మకాలు, అద్దెకు తిప్పడాలు, విద్యాసంస్థల నిర్వహణ వంటి అనేక ఆదాయ మార్గాల్లో పెట్టుబడులు పెడుతున్నట్లు స్పష్టం అయ్యింది. (విద్యా సంస్థలలో పెట్టుబడులు ఆదాయమార్గం గానే కాకుండా వర్గపరంగా కూడా సామాజిక ఆధిపత్యం నెలకొల్పడానికి కూడా దోహదం చేస్తుంది). ఇలాంటి కుటుంబాలు పంచాయితీ రాజ్, ఎగువ శాసన సభ, విలీనం, న్యాయవాద రంగాలతో సంబంధాలు వెతుక్కుంటున్నాయి.

ఉన్నత విద్యావకాశాలు, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను ఎక్కువగా దక్కించుకుంటున్నది కూడా ఈ గ్రామీణ ప్రాంత నయాధనిక వర్గమే. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వివిధ రాజకీయ పక్షాలకు మద్ధతుగా నిలబడుతుంది. రాజ్యాధికారంలో ఈ నయా గ్రామీణ ధనిక వర్గం పోషించే పాత్ర మూలంగా రాజకీయ పార్టీల అధికారంలో కూడా ప్రధాన పాత్ర నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పాలక

శక్తులుగా ఎదిగాయి. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సంక్షేమానికి ఉద్దేశించిన ప్రభుత్వ పథకాల నిధుల మీద ఆధిపత్యం, అజమాయిషీ చలాయిస్తున్నాయి. ఆ నిధులను స్వీయ ప్రయోజనాలకు మళ్లిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరులో మనకు ఇది కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఫ్యూడల్ స్వభావం గల ఈ కాంట్రాక్టర్లు అలవిమాలిన రీతిలో లాభాలు పోగేసుకుంటున్నారు.

నాట్లు, కోతల సమయంలో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నవారు మిగిలిన ఏడాది కాలంలో వ్యవసాయేతర కూలి పనులకు వెళుతున్నారు. పొలం పని చేసినా, రోడ్ల నిర్మాణ కార్మికుడిగా పనిచేసినా, ఉపాధి హామీ కార్మికుడిగానో వ్యవసాయ–వ్యవసాయేతర పనులకోసం వలస కార్మికుడిగా మారినా **ప్రధానంగా వీరు వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీళ్ళ మూలాలు వ్యవసాయ కార్మిక వర్గంలో ఉన్నాయి.** ఇంత వైవిధ్యం ఉన్న కార్మికులను ఐక్యపరిచి నిర్మాణపరంగా సంఘటితపరచడానికి పెద్దఎత్తున కృషి జరగాలి. కేరళ అనుభవం మనకు ఇందుకు ఒక ఉదాహరణ. కేరళ జనాభా లెక్కల ప్రకారం ఆ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల సంఖ్య 9 లక్షలు కానీ ఉపాధిహామీ కార్మికుల సహా అక్కడి మన సంఘ సభ్యత్వం 25 లక్షలు.

గ్రామీణ ప్రాంత కార్మికుల సమస్యలు కేవలం పని ప్రదేశానికే పరిమితం కాలేవు. కూలి, భూమి, నివాసగృహాలు, సంక్షేమ పథకాలు, కుల వివక్ష వంటి సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. కాబట్టి మన సంఘం పని ప్రదేశంలో సమస్యల మీదనే కాకుండా రోజువారీ జీవితంలో వారు ఎదుర్కొంటున్న సమస్యల మీద కూడా పనిచేసిన అనుభవం మన సంఘానికి ఉన్నది. గ్రామీణ శ్రామిక వర్గంలో భాగంగా ఉన్న కష్టజీవులు అందరినీ సంఘటితపరచడం మన సంఘం లక్ష్యం కావాలి. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోని స్కీం వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులు మినహా అందరినీ మన సంఘంలో సభ్యులుగా చేర్చుకోవాలి. **అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘంగా ఉన్న మన సంస్థ పేరును అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘంగా మార్చుకోవాలి.**

## కర్తవ్యాలు:

1. వ్యవసాయ కార్మిక సంఘం బలహీనంగానో, స్తబ్దతగా ఉన్నచోట్ల పార్టీ కమిటీలు శ్రద్ధ తీసుకుని మన సంఘాన్ని బలోపేతం చేసే కృషి చేపట్టాలి.
2. ఇళ్ళ సమస్య, భూమి సమస్య, కూలిరేట్లు, ఉపాధి హామీ పనులు వంటి స్థానిక సమస్యలను పార్టీ గుర్తించి వ్యవసాయ కార్మిక సంఘం ద్వారా ఆ స్థానిక సమస్యల మీద ఆందోళన చేపట్టేలా చూడాలి.
3. పార్టీ కమిటీలు ఈ రంగానికి తగినంతమంది కార్యకర్తలను కేటాయించాలి. అలాగే ఈ సంఘానికి స్వతంత్రంగా నిధులు సమకూర్చుకోలేని పరిస్థితులు ఎదురయితే సంఘం కార్యకర్తలకు పార్టీయే అలవెన్సులు చెల్లించేలా చూడాలి.
4. రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఫ్రాక్షన్ కమిటీలు వెయ్యాలి. ఉన్న కమిటీలు చురుగ్గా పనిచేసేలా చూడాలి. ఫ్రాక్షన్ కమిటీలు పార్టీ నిర్మాణం మీద దృష్టి కేంద్రీకరించాలి.
5. మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషిచెయ్యడం, సభ్యత్వ చేర్పింపు, కమిటీలో ప్రాతినిధ్యంలో వారికి తగిన చోటు కల్పించడం – ఈ అంశాలను పార్టీ, ఫ్రాక్షన్ కమిటీలు పర్యవేక్షించాలి.
6. వ్యవసాయ కార్మికులకు అఖిలభారత స్థాయినుండి జిల్లా స్థాయి వరకు పార్టీ క్లాసులు నిర్వహించాలి.
7. దళితులు, గిరిజనులు, మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను వ్యవసాయ కార్మికోద్యమంలో భాగంగా చేపట్టాలన్న అవగాహన పార్టీ అఖిలభారత, రాష్ట్ర కమిటీలు కల్పించాలి.
8. గ్రామీణ ప్రాంత భూస్వాములు, పెట్టుబడిదారీ రైతాంగంలో పాలక వర్గ శక్తుల మిలాఖతును ఎదుర్కోవడానికి గ్రామీణ ప్రాంత పేదరైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ శ్రామికులను ఐక్యం చెయ్యడం మీద ప్రధాన దృష్టి పెట్టాలి.
9. కార్మిక–కర్షక వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడానికి కార్మిక–రైతు – వ్యవసాయ కార్మిక రంగాల ఐక్యపోరాటాలు పెంపొందించాలి.

## వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ వివరాలు

| రాష్ట్రం | 2021 | 2021-2022 | 2022-2023 |
|---|---|---|---|
| కేరళ | 2503380 | 2560237 | 2647970 |
| బెంగాల్ | 1510031 | 1705573 | 1829910 |
| తెలంగాణ | 911516 | 1104006 | 1149548 |
| ఆంధ్రప్రదేశ్ | 477155 | 484156 | 491893 |
| తమిళనాడు | 447103 | 613825 | 680521 |
| త్రిపుర | 96646 | 106060 | 105060 |
| కర్నాటక | 228194 | 302671 | 323175 |
| పంజాబ్ | 230600 | 223187 | 254392 |
| ఉత్తరప్రదేశ్ | 131568 | 168244 | 178071 |
| బీహార్ | 135042 | 142108 | 143495 |
| మహారష్ట్ర | 58018 | 60177 | 70664 |
| రాజస్థాన్ | 31700 | 32907 | 33209 |
| హర్యానా | 21542 | 26782 | 17510 |
| ఒడిషా | 18200 | 21180 | 22400 |
| మధ్యప్రదేశ్ | 1109 | 1600 | 3782 |
| జార్ఖండ్ | 3227 | 4125 | 0 |
| పుదుచ్చేరి | - | - | 7000 |
| అస్సాం | - | - | 1548 |
| ఉత్తరఖాండ్ | - | - | - |
| గుజరాత్ | - | - | - |
| కేంద్రం | 7 | 6 | 6 |
| **మొత్తం** | **6805038** | **7556844** | **7960154** |

ప్రతులు : 1500 ప్రచురణ కాలం : అక్టోబర్ 2024 వెల : ₹ . 20/-

162582

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 9490099018, 9490099057